
పండగే.. పండగ

నేడే ఎన్టీఆర్ పింఛన్ల పంపిణీ

- జిల్లావ్యాప్తంగా 2,70,966 మంది లబ్ధిదారులు
- ఇళ్ల వద్దే పంపిణీకి ఏర్పాట్లు
- ఉదయం 6 గంటలకే ప్రారంభం
- పాల్గొననున్న ప్రజాప్రతినిధులు



పుట్టపర్తి/హిందూపురం, జూన్ 30: వృద్ధులు, దివ్యాంగులు, ఆసరాలేని వారికి అసలైన పండగ ఇది. పెంచిన పింఛన్ సొమ్ముకు అరియర్స్ కలిపి సోమవారం పంపిణీ చేయనున్నారు. కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీని జిల్లా వ్యాప్తంగా పండగలా నిర్వహించేందుకు ఊరువాడా ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబునాయుడు పింఛన్ సొమ్ము పెంపుపై సంతకం చేశారు. లబ్ధిదారుల్లో భరోసా నింపారు. పింఛన్ల పంపిణీని పండగలా నిర్వహించుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. పింఛన్ల పంపిణీలో మంత్రులు, ఎమ్మెల్యే, కలెక్టర్, జిల్లా, మండలస్థాయి అధికారులతోపాటు కూటమి నాయకులు పాల్గొననున్నారు. జిల్లా కేంద్రంతోపాటు మున్సిపల్, నగరపంచాయతీ, పంచాయతీ కేంద్రాల్లో పంపిణీని ప్రారంభిస్తారు. సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేయనున్నారు.

ఏప్రిల్ నుంచి..

ఎన్నికలకు ముందు చంద్రబాబు నాయుడు.. ఏప్రిల్ నుంచే పింఛన్ పెంపును వర్తింపజేస్తామని హామీ ఇచ్చారు. దానిని ప్రస్తుతం అమలు చేస్తున్నారు. దీంతో పెంచిన పింఛన్‌తోపాటు ఏప్రిల్, మే, జూన్ నెలల అరియర్స్ కూడా ఇవ్వనున్నారన్నమాట. వృద్ధాప్య, వితంతు పింఛన్‌ను వైసీపీ హయాంలో రూ.3 వేలు ఇస్తుండేవారు. ప్రస్తుతం దానిని రూ.4 వేలకు పెంచారు. ఏప్రిల్ నుంచి నెలకు రూ.వెయ్యి చొప్పున మొత్తం రూ.3 వేలు కలిపి పంపిణీ చేయనున్నారు. ఆ లెక్కన రూ.7 వేలు ఇవ్వనున్నారన్న మాట.

సచివాలయాలకు చేరిన పింఛన్ల సొమ్ము

జిల్లావ్యాప్తంగా 544 సచివాలయాలున్నాయి. సోమవారం పింఛన్లను పంపిణీ చేసేందుకు అవసరమైన సొమ్ము ఆయా సచివాయాలకు ఇప్పటికే చేరింది. జిల్లాలోని 4,349 మంది సచివాలయ ఉద్యోగులు పంపిణీలో పాల్గొంటున్నారు. వీరు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం వరకు తప్పనిసరిగా విధుల్లో ఉండాల్సిందే. వీరితోపాటు స్థానికంగా ఉన్న ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు.. లబ్ధిదారుల ఇళ్లకే వెళ్లి ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేయనున్నారు. ప్రభుత్వం హామీని నిలబెట్టుకుందని తెలియజేసి, కూటమిని గెలిపించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలపనున్నారు.

6 గంటలకే ప్రారంభం: నరసయ్య, డీఆర్‌డీఏ పీడీ

ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ సోమవారం ఉదయం 6 గంటలకే ప్రారంభమవుతుంది. ఆయా గ్రామాల్లో సచివాలయ సిబ్బంది పింఛన్‌దారుల ఇళ్ల వద్దకెళ్లి అందజేస్తారు. పింఛన్ పంపిణీలో స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు పాల్గొనాలని కోరాం.

చంద్రబాబు పెద్ద కొడుకులా తోడు నిలిచాడు

వృద్ధాప్యంలో ఇంటి పెద్ద కొడుకులా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తోడుగా నిలిచాడు. పెంచిన పింఛన్ సొమ్ము రూ.4 వేలతోపాటు ఏప్రిల్, మే, జూన్ నెలలతో కలిపి రూ.7 వేలు సోమవారం ఇంటికి వచ్చి పంపిణీ చేస్తానంటున్నారు. చంద్రబాబుకు ఎప్పటికీ రుణపడి ఉంటాం.

- అన్నమనేని వెంకటరమణ, ముదిగుబ్బ

మా బిడ్డకు ఎంతో భరోసా



నా కుమారుడికి 15ఏళ్లు. పుట్టుకతోనే దివ్యాంగుడు. ఇప్పటికీ చిన్న బిడ్డలా చూసుకోవాలి. ప్రభుత్వం పింఛన్ సొమ్ము పెంచడం మాలాంటి పేద కుటుంబాలకు ఎంతో ఉపయోగకరం. మాబిడ్డకు ఎంతో భరోసా. **- సాకమ్మ, పూలకుంట, హిందూపురం మండలం**

రుణపడి ఉంటాం..



మా కుటుంబానికి పింఛన్ సొమ్మే ఆధారం. పింఛన్ నగదు రూ.3వేల నుంచి రూ.4వేలకు పెంచడం సంతోషకరం. మూడు నెలల పింఛన్ సొమ్ము తీసుకోవడానికి ఇబ్బందులు పడ్డాం. నేటి నుంచి ఇంటివద్దకే పింఛన్ అందజేస్తారు. మాకు ఎలాంటి ఇబ్బందీ ఉండదు. చంద్రబాబు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. మా కుటుంబం జీవితాంతం రుణపడి ఉంటుంది.


- నరసక్క, పూలకుంట, హిందూపురం మండలం

ఇతరులపై ఆధారపడకుండా..



గత వైసీపీ పాలనలో పెంచిన రూ.వెయ్యి ఏడాదికి రూ.250చొప్పున పెంచుకుంటూ వచ్చారు. చివరి ఆరు నెలలు మాత్రమే రూ.3వేలు ఇచ్చారు. చంద్రబాబునాయుడు చెప్పిన మాట ప్రకారం ముఖ్యమంత్రి అయిన వెంటనే పెంచిన పింఛన్‌తోపాటు గత మూడు నెలలు కలుపుకుని రూ.7వేలు ఇవ్వనుండడం హర్షణీయం. మాలాంటి పేదలకు ఎంతగానో భరోసానిస్తుంది. **-మదీనా, హిందూపురం**

చంద్రబాబునాయుడు.. వృద్ధుల పాలిట దేవుడు..



పింఛన్ సొమ్మును పెంచి చంద్రబాబు నాయుడు.. మాలాంటి వృద్ధుల పాలిట దేవుడిగా మారారు. రాష్ట్ర ప్రజల కష్టాలు తెలిసిన నేత చంద్రబాబు. రూ.7 వేలు అందుకుంటుండడంతో వృద్ధులు ఆనందంగా ఉన్నారు.

- లక్ష్మప్ప, జమ్మానిపల్లి, మడకశిర మండలం





నృత్యం చేస్తున్న భక్తులు

ఎన్టీఆర్ భరోసాతో పేదల కళ్లలో ఆనందం

టీడీపీ జిల్లా అధ్యక్షుడు



కొల్లకుంట అంజినప్ప

హిందూపురం, జూన్ 30: ఎన్టీఆర్ భరోసా పింఛన్‌తో పేదల కళ్లలో ఆనందం కనబడుతోందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప అన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో 2.71 లక్షల మందికి పెంచిన మొత్తంతో కలిపి సోమవారం రూ.185 కోట్లు పంపిణీ చేస్తారన్నారు. ఎన్నికలకు ముందు చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు పింఛన్లు 1వ తేదీనే అందజేస్తున్నారన్నారు. ఈస్థాయిలో పింఛన్ దేశంలో ఎక్కడా ఇవ్వలేదన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ ముందుకెళ్తోందన్నారు. సోమవారం గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి నాయకులు పింఛన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. పెంచిన పింఛన్ మొత్తాన్ని లబ్ధిదారులకు అందివ్వడంతోపాటు ఈ విషయాన్ని ప్రతి ఒక్కరికీ తెలియజేయాల్సిన బాధ్యత టీడీపీ కార్యకర్తలపై ఉందన్నారు. మొదటి రోజే 90శాతం పింఛన్ల పంపిణీకి టీడీపీ కార్యకర్తలు సహకరించాలన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకున్న చంద్రబాబుకు, కూటమి నేతలు పవన్‌కల్యాణ్, బీజేపీ నేతలకు జిల్లా అధ్యక్షుడు కృతజ్ఞతలు తెలిపారు.

పరవశింపజేసిన నృత్యరూపకం

పుట్టపర్తి, జూన్ 30: సాయివనంలో పారిజాతాలు పేరున బాపట్ల జిల్లాకు చెందిన సత్యసాయి భక్తులు ఆదివారం స్థానిక ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ మందిరంలో ప్రదర్శించిన నృత్యరూపకం భక్తిపారవశ్యం పంచింది. బాపట్ల జిల్లా భక్తుల సాంస్కృతిక కార్యక్రమాలు రెండోరోజు కూడా కొనసాగాయి. గంటపాటు నృత్యగానంతో భక్తులను అలరింపజేశారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.



రన్నరప్ ట్రోఫీ అందుకుంటున్న శ్రీసత్యసాయి జిల్లా జట్టు

రన్నరప్ శ్రీసత్యసాయి జిల్లా

అంతర్‌జిల్లా సీనియర్ బాలుర హాకీ టోర్నీ విజేత తిరుపతి

ధర్మవరం, జూన్ 30: అంతర్‌జిల్లా సీనియర్ బాలుర హాకీ టోర్నీలో ఆతిథ్య శ్రీసత్యసాయి జిల్లా జట్టు రన్నరప్‌గా నిలిచింది. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ఆదివారం నిర్వహించిన ఫైనల్లో తిరుపతి, శ్రీసత్యసాయి జిల్లాల జట్లు తలపడ్డాయి. శ్రీసత్యసాయి జిల్లా జట్టు 1-4 గోల్స్ తేడాతో తిరుపతి చేతిలో ఓడిపోయింది. రన్నరప్‌గా నిలిచింది. విజేత, రన్నరప్ జట్లకు ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ, హాకీ ఆంధ్రప్రదేశ్ సీఈఓ నిరంజన్ రెడ్డి, అధ్యక్షుడు చాణక్యరాజు ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో హాకీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బంధనాథం సూర్యప్రకాశ్, జిల్లా కోశాధికారి థామస్, జాయింట్ సెక్రటరీ అరవింద్ గౌడ్, ఉపాధ్యక్షుడు గౌరీప్రసాద్ పాల్గొన్నారు.

దౌర్జన్యకాండ

వైసీపీ పాలన అంతా అరాచకాలే..

"వైసీపీ పాలన ఐదేళ్లూ నియోజకవర్గంలో అరాచకాలకు పాల్పడ్డారు. అప్పట్లో వైసీపీ నాయకుల దాడులు, దౌర్జన్యాలకు తెగబడ్డారు. ప్రతిపక్షాలపై జులుం ప్రదర్శించారు. బహిరంగంగానే ప్రతిపక్ష నేతలపై దాడులకు తెగబడిన ఉదంతాలు కోకొల్లలు. హత్యాయత్నాలకు కూడా వెనకాడలేదు. అయినా వారికి కొందరు పోలీసులు అండగా నిలిచారన్న ఆరోపణలున్నాయి. వైసీపీ నాయకులు దాడులు చేశారని పోలీసు స్టేషన్‌కు వెళితే బాధితులపైనే నాన్ బెయిలబుల్ కేసులు పెట్టి, అరెస్టు చేసిన ఉదంతాలు లేకపోలేదు. వైసీపీతో అంటకాగిన పోలీసులు, అధికారులు.. ప్రభుత్వం మారినా నేటికీ టీడీపీ శ్రేణులను ఇబ్బందులు పెడుతున్నారు. వైసీపీ నాయకులు అప్పట్లో సాగించిన అరాచకాలపై ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని జనం కోరుతున్నారు."



తాడిమర్రి పోలీసుస్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న టీడీపీ నాయకులు (ఫైల్)

నియోజకవర్గంలో దాడుల వివరాలివీ..



ప్రతిపక్ష నాయకులపై జులుం ప్రశ్నిస్తే దాడులు..



జడ్పీ వైస్‌చైర్మన్ కామిరెడ్డిపల్లి సుధాకర్ రెడ్డి, ఆయన అనుచరుల దాడిలో తీవ్రంగా గాయపడిన జవాను సమరసింహారెడ్డి (ఫైల్)

- ధర్మవరంలోని 26వ వార్డు సచివాలయంలో వీఆర్వో అశోక్‌పై స్థానిక వైసీపీ వర్గీయుడు సాకే నరసింహులు.. సచివాలయంలోకి చొరబడి మరీ.. దాడిచేశాడు. ఫర్నీచర్‌ను ధ్వంసం చేశాడు. ప్రభుత్వ స్థలానికి ఫెన్సింగ్ వేశారనీ, వెంటనే తొలగించాలని చెప్పినందుకు దాడికి తెగబడ్డాడు. వీఆర్వో ఫిర్యాదు మేరకు అప్పట్లో కేసు నమోదైంది.
- ధర్మవరం మండలంలోని తుమ్మల గ్రామానికి చెందిన ఆర్మీజవాను సమరసింహారెడ్డిపై జడ్పీ వైస్‌చైర్మన్ కామిరెడ్డిపల్లి సుధాకర్ రెడ్డి, అతడి అనుచరులు రాడ్లు, కట్టెలతో విచక్షణారహితంగా దాడిచేశారు. గతేడాది ఏప్రిల్ 11న తుమ్మల గ్రామంలో రోడ్డుకు అడ్డంగా ఉన్న సుధాకర్ రెడ్డి కారును పక్కకు తీయాలని చెప్పినందుకు జవానును తీవ్రంగా కొట్టారు. ఈ దాడి రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపింది. దాడిచేసిన వారిపై కేసు నమోదైంది.
- ధర్మవరం మున్సిపల్ ఉద్యోగి కృష్ణపై 2022 నవంబరు 6న వైసీపీ కౌన్సిలర్ జేసీబీ రమణ పట్టపగలే అందరూ చూస్తుండగా దాడి చేశాడు. మున్సిపల్ స్థలంలో ఆక్రమణలను తొలగించాలని నోటీసులు ఇచ్చేందుకు వెళ్లిన కృష్ణను బూతులు తిడుతూ కొట్టాడు. దాడికి సంబంధించిన వీడియో అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా వైరల్ అయింది. కౌన్సిలర్‌పై కేసు నమోదైంది.
- ధర్మవరం పట్టణంలోని లోనికోటలో ఓ సచివాలయ ఉద్యోగిపై అదే వార్డుకు చెందిన వైసీపీ నాయకుడు, కౌన్సిలర్ భర్త తొండమాల రవి దాడికి యత్నించాడు. హౌసింగ్ బిల్లు చేయలేదని ఉద్యోగిపై సచివాలయంలోనే కొట్టబోయాడు.
- జనవరి 1వ తేదీన ధర్మవరం ప్రభుత్వాస్పత్రిలో వైఎస్సార్ విద్యార్థి సంఘం నాయకుడిగా చెప్పుకునే వినయ్‌తేజ్ గౌడ్.. తన అనుచరులు ద్విచక్రవాహనం నుంచి కిందపడి గాయపడడంతో చికిత్స నిమిత్తం అక్కడున్న వైద్య సిబ్బందికి వార్నింగ్‌లు ఇస్తూ చిందులు తొక్కారు. నోటికొచ్చినట్లు తిట్టిన వీడియో వైరల్ అయింది. ఈ ఘటన సిబ్బందిలో భయాందోళనలు రేపింది. ఒకానొక దశలో విధులు బహిష్కరించేందుకు సిబ్బంది సన్నద్ధమయ్యారు. అప్పట్లో అధికార పార్టీకి చెందినవారు కావడంతో ఆస్పత్రి ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని, సిబ్బందికి సర్దిచెప్పారు.
- ధర్మవరం మండలంలోని ఓబుళనాయనిపల్లిలో పోలింగ్ ముగిసిన రెండోరోజే కూటమి తరఫున ఏజెంట్లుగా కుర్చుంటారా అని అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు బోగలింగమయ్య, ఆయన కుమారుడు సింహాద్రిపై దాడిచేశారు. దీంతో వైసీపీ నాయకులు గడుపూటి గంగాధర్‌నాయుడు, కందేరి ఆదినారాయణ, దాసరి శ్రీనివాసులు,సోమశేఖర్, అనంతరాయుడుపై నామమాత్రపు కేసు నమోదు చేశారు.
- మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి ముఖ్య అనుచరుడు ముదిగుబ్బ మండల కన్వీనర్ ఇందుకూరు నారాయణరెడ్డి అదే మండలంలోని సర్వేయర్ అంజినాయక్‌పై ఓ భూమి విషయంలో తమకు తెలియకుండా సర్వేకు వెళ్లాడన్న నెపంతో ఫోన్‌లో నానా దుర్భాషలాడాడు. కనీస కనికరం లేకుండా ఇంట్లో వాళ్లను ఆపాదిస్తూ సర్వేయర్‌ను బండబూతులు తిట్టాడు. సర్వేయర్‌తోపాటు అప్పటి డిప్యూటీ తహసీల్దార్‌ను ఫోన్‌లో అసభ్యకరంగా మాట్లాడిన ఆడియో అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా సంచలనమైంది.
- ముదిగుబ్బలో ప్రతిపక్ష పార్టీకి చెందిన సత్యనారాయణపై వైసీపీ వర్గీయుడు శ్రావణ్ దాడి చేయడమే కాక పోలీసులతో తీవ్రంగా కొట్టించి, ఆపై ఆయనపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయించాడు.
- పోలీసు స్టేషన్లలో పోలీసులను, తహసీల్దార్‌కార్యాలయాల్లో అధికారులను, సచివాలయ సిబ్బందిని నానాదుర్భాషలాడినట్లు ఉద్యోగుల ద్వారా తెలుస్తోంది. లోలోపల మదనపడుతూ చేసేదేమీలేక విధులు నిర్వర్తించాల్సి వచ్చిందని పలువురు ఉద్యోగులు బహిరంగంగానే చెబుతున్నారు.
- ముదిగుబ్బలోని రైల్వేగేటు కొట్టాలకు చెందిన తెలుగుదేశం కార్యకర్త దాదు పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారని గతేడాది అక్టోబరులో వైసీపీ నాయకులు దాడిచేసి, ఇంట్లోని సామగ్రిని ధ్వంసం చేశారు. అప్పట్లో పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదుచేసినా పట్టించుకోలేదు.
- తాడిమర్రి మండలంలో గతేడాది ఆగస్టు 30న రాత్రి టీడీపీ ఎస్సీ సెల్ నియోజకవర్గ నాయకుడు గణేశ్‌కు చెందిన 300 చీనీచెట్లను దుండగులు నరికేశారు. అప్పట్లో ఎస్‌ఐ లక్ష్మీనారాయణ కేసు నమోదు చేయకపోవడంతో స్టేషన్ ఎదుట టీడీపీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. కేసు నమోదు చేయించారు. ఇప్పటి వరకు చెట్లను నరికిన వారిని పోలీసులు గుర్తించలేకపోయారు.
- బత్తలపల్లి మండలంలోని పోట్లమర్రి గ్రామంలో వైసీపీ నాయకుడి ఇంటికి వెళ్లడానికి విశాలమైన దారి కోసం టీడీపీ కార్యకర్త ఓబులేసుకు చెందిన పూరి గుడిసెను కూల్చేశారు. అంతటితో ఆగకుండా ఆయనపైనే దాడి చేయడంతో పోలీసులు కేసు నమోదుచేశారు.
- మండలంలోని డీచెర్లోపల్లిలో వైసీపీ నాయకుడి ఇంటికి వెళ్లే దారికోసం టీడీపీ నాయకుడి భూమిలో రోడ్డు నిర్మాణం చేపట్టారు. తమ భూముల్లో ఎలా వేస్తారని టీడీపీ నాయకులు ప్రశ్నించారు. దీంతో వైసీపీ నాయకులు 9 మంది టీడీపీ నాయకులపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయించారు.

-ధర్మవరం

117 జీఓను రద్దు చేయాలి

ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్ రెడ్డి



మాట్లాడుతున్న హరిప్రసాద్ రెడ్డి

కదిరిఅర్బన్, జూన్ 30: ప్రభుత్వ ప్రాథమిక విద్యారంగానికి గొడ్డలిపెట్టుగా మారిన జీఓ 117ను రద్దు చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్ రెడ్డి డిమాండ్ చేశారు. యూనియన్ డివిజనల్ స్థాయి సమావేశాన్ని పట్టణంలో ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ.. ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5 తరగతులను సమీప ఉన్నత పాఠశాలల్లో విలీనం చేస్తూ 117 జీఓ తీసుకొచ్చారన్నారు. దీంతో ప్రాథమిక పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. 3, 4, 5 తరగతుల పిల్లలు పాఠశాలలో లేకపోవడంతో మిగతా వారు చేరడానికి ఆసక్తి చూపట్లేదన్నారు. వెరసి విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందని ఆవేదన చెందారు. ఓవైపు నాడు-నేడుతో ప్రభుత్వ బడుల రూపురేఖలు మారుస్తామంటూనే.. మరోవైపు విలీనం పేరుతో పిల్లలను బడికి దూరంచేయడం ఏమిటని ప్రశ్నించారు. వెంటనే 117 జీఓను రద్దుచేసి, ప్రభుత్వ విద్యను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి రామమోహన్, అసోసియేట్ అధ్యక్షుడు సీడీ జవహర్, నాయకులు పాల్గొన్నారు.

నేడు ప్రజాఫిర్యాదుల స్వీకరణ

పుట్టపర్తి, జూన్ 30: స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు ఆదివారం ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతోపాటు డివిజన్, మున్సిపల్, మండల కేంద్రాల్లో కార్యక్రమం ఉంటుందనీ, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.





గ్రిల్ ఏర్పాటు ఇలా..

క్రికెట్ నెట్స్ ఏర్పాటు చేస్తున్న దృశ్యం

ఆటశాల..!



వ్యాయామం చేసుకోవడానికి ఏర్పాటు చేసిన పరికరాలు

- ఆ పాఠశాలలో అన్ని క్రీడలకు అవకాశం
- దాతల సహకారంతో క్రీడాభివృద్ధి పనులు
- జాతీయ, అంతర్జాతీయ పోటీల్లోనూ రాణించిన విద్యార్థులు
- పూర్వ విద్యార్థుల సహకారంతో పీడీ కృషి

బెళుగుప్ప, జూన్ 30: అది చదువులు చెప్పే పాఠశాల మాత్రమే కాదు.. ఎందరో క్రీడాకారులను తయారు చేసే ఆటశాలగా చెప్పవచ్చు. బెళుగుప్ప మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో దాతల సహకారంతో చేపట్టిన క్రీడాభివృద్ధి పనులు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. గతంతో ఈ పాఠశాల విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో సైతం రాణించారు. విద్యార్థులకు క్రీడల పట్ల ఆసక్తి ఉన్నా సౌకర్యాలు కరువై దూరంగా వున్నారు. వారిలో క్రీడానైపుణ్యాన్ని గమనించిన పీడీ రాజశేఖర్ చొరవ తీసుకుని క్రీడాభివృద్ధికి చర్యలు తీసుకున్నారు. పాఠశాల పరిస్థితిని పూర్వ విద్యార్థుల దృష్టికి తీసుకెళ్లి వారి సహకారంతో విద్యార్థులకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. పాఠశాల మైదానంలోకి వెళ్లగానే లక్షలాది రూపాయల క్రీడా సామగ్రి దర్శనమిస్తాయి. విద్యార్థులు ఆసక్తి ఉన్న ఏ ఆటనైనా ఆడడానికి ఏర్పాట్లు చేశారు. లక్షల రూపాయలతో ఏర్పాటు చేసిన క్రికెట్ నెట్, సాఫ్ట్‌బాల్, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్ కోర్టులు, కబడ్డీ, ఖోఖో, జూడో తదితర క్రీడలు ఆడుకునేలా సౌకర్యాలు కల్పించడానికి పీడీ చర్యలు తీసుకున్నారు. వీటితోపాటు పాఠశాల గ్రీన్‌కో పూర్వ విద్యార్థుల సహకారంతో రూ.3లక్షలతో ప్రధాన గేట్, గ్రిల్ నిర్మిస్తున్నారు.





క్రీడాకారులుగా తీర్చిదిద్దడమే ధ్యేయం
● రాజశేఖర్, పీడీ

విద్యార్థులకు అనుకూలంగా మరింత ఆటస్థలం లేదు. ఈ పాఠశాలలో 400 మందికి పైగా విద్యార్థులు వుంటున్నారు. క్రీడల పట్ల ఆసక్తి ఉన్నా ఆట స్థలం లేదు. విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాన్ని గుర్తించి వారిని తీర్చిదిద్దుతున్నాం. ఆడుకునేందుకు అవసరమైన సౌకర్యాలు కల్పించడానికి ఎంతో మంది దాతలు ముందుకొస్తున్నారు. ప్రజల సహకారముంటేనే ఏదైనా అభివృద్ధి సాధ్యమవుతుంది.



దాతల సహకారం మరువలేనిది..
వెంకటప్రసాద్, హెచ్ఎం

పాఠశాలలో క్రీడాభివృద్ధికి దాతల సహకారం మరువలేనిది. పూర్వ విద్యార్థులు, గాలిమరల కంపెనీలు స్వచ్ఛందంగా ఆర్థిక సహాయం అందించడానికి ముందుకురావడం అభినందనీయం.

బోల్తా కొట్టిన బీర





సాగు చేసిన బీర పంట

- ఊరించి.. ఉసూరుమనిపించిన ధరలు ● మొన్నటివరకు రూ.40.. నేడు రూ.13..
- అమాంతం పడిపోయిన వైనం ● పంట చేతికొచ్చే వేళ రైతుకు తప్పని ఆవేదన
- కళ్యాణదుర్గం నియోజకవర్గ వ్యాప్తంగా 250 ఎకరాల్లో సాగు

కళ్యాణదుర్గం, జూన్ 30: కష్టించి సాగు చేసిన పంటలు తీరా చేతికొచ్చే వేళ ధరలు పడిపోతుండంతో అన్నదాతల అవస్థలు అంతా ఇంతా కాదు. బీరకాయి కేజీ ధర మొన్నటివరకు రూ.40 వరకు పలికింది. అన్నదాత సంతోషం నాలుగు రోజుల్లోనే ఆవిరైపోయింది. ఒక్కసారిగా బీర ధరలు అమాంతం పడిపోయాయి. కేజీ బీరకాయల ధర రూ.13కు పడిపోవడంతో అన్నదాత అయోమయంలో పడ్డారు. ఎకరాకు రూ. 1.50 లక్షల నుంచి రూ. 2 లక్షలు వెచ్చించి బీర పంటను సాగు చేశారు. కళ్యాణదుర్గం నియోజకవర్గ వ్యాప్తంగా కంబదూరు, కుందుర్పి, శెట్టూరు, బ్రహ్మసముద్రం, కళ్యాణదుర్గం రూరల్ మండలాల్లో బీర పంటను అధికంగా సాగు చేశారు. దాదాపు 250 ఎకరాల్లో బీర పంటను సాగు చేశారు. సుమారు రూ. 3 కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టారు. చివరికి ధరలు పడిపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉండిపోయారు. 20 రోజుల క్రితం వర్షాలకు తట్టుకుని, ఎంతో వ్యయప్రయాసాలతో మందులను పిచికారి చేసి వర్షానికి సైతం పంటను కాపాడుకున్నారు. అంతలా శ్రమించిన రైతులకు ధరలు పడిపోవడంతో కనీసం పెట్టుబడులు కూడా చేతికందడం లేదని వాపోతున్నారు. 40 రోజులపాటు కంటికి రెప్పలా పంటను కాపాడుకుంటూ వచ్చారు. అధిక దిగుబడులు వచ్చినా.. ధరతో రైతులు నట్టేట మునిగారు. కనీసం రూ.20 నుంచి రూ.25వరకు ధర పలికినా పెట్టుబడి కాస్తో, కూస్తో వచ్చే అవకాశాలు ఉన్నాయి. రూ.13కి ధర పడిపోవడంతో పెట్టుబడి కూడా దకక్కడం లేదని అన్నదాత ఆందోళన చెందుతున్నారు. ఖమ్మం, కరీంనగర్, హైదరాబాద్ పట్టణాలకు సైతం బీరకాయను బాక్సుల్లో పెట్టి తరలించినా, రవాణా ఖర్చులకే సరిపోతుందే తప్ప. రైతుకు ఉపయోగం లేదు. ఏ పంట పెట్టాలన్నా రైతులు భయపడే పరిస్థితి నెలకొంది. తమ బాధలు ఎవరికి చెప్పుకోవాలో అని రైతులు వాపోతున్నారు.



బాక్సుల్లోకి నింపిన బీరకాయలు

నాలుగెకరాల్లో సాగు చేసి నష్టపోయా..
శ్రీనివాసులు, రైతు, ఒంటారెడ్డిపల్లి



నాలుగు ఎకరాల్లో బీర పంటను సాగు చేశాను. 20 రోజుల క్రితం రూ.40 వరకు కేజీ ధర పలికింది. నేడు రూ.13కు పడిపోవడం బాధాకరం. ఈ ధరతో అమ్మితే కనీసం పెట్టుబడులు కూడా రావు. ఏ పంట పెట్టాలన్నా ధరల తగ్గుదలతో వెనుకడుగు వేసే పరిస్థితి ఉంది. ఇలాగే ఉంటే సాగు చేయలేకపోతాం.

పెట్టుబడులు కూడా రావు
: విజయకుమార్, రైతు, ఒంటారెడ్డిపల్లి



అమాంతంగా బీర ధర తగ్గడంతో పెట్టుబడులు కూడా రావు. మూడు ఎకరాల్లో బీర సాగు చేశారు. దిగుబడి బాగానే ఉన్నా, ధరలతో నట్టేట మునిగాం. సాగు చేసిన మొదల్లో బాగానే ధరలు ఉన్నప్పటికీ, కోతకు వచ్చిన సమయంలో ధర పడిపోయింది. మార్కెట్‌కు తరలించినా రవాణా ఖర్చులకు కూడా సరిపోదు.

డయేరియా కట్టడికి చర్యలు

అనంతపురం టౌన్ జూన్ 30: జిల్లాలో అతిసార వ్యాధిని కట్టడికి 'స్టాప్ డయేరియా' పేరుతో సోమవారం నుంచి నెల రోజుల పాటు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ ఈ.బీ.దేవి ఆదివారం తెలిపారు. గ్రామస్థాయిలో పర్యటిస్తూ అతిసారపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. ఇక ప్రతి ఆస్పత్రిలోను రాపిడ్ రెస్పాన్స్ టీమ్ ఉంటుందని, బాధితులు ఆస్పత్రికి వస్తే వారికి వెంటనే వైద్యసేవలు అందుతాయని తెలిపారు. బాధిత కుటుంబాలు, పరిసర ప్రాంతంలో అతిసార ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామన్నారు. పాఠశాలలు, హాస్టల్స్ అంగన్‌వాడీ కేంద్రాలను అధికారులు, సిబ్బంది సందర్శిస్తూ వారికి అతిసారపై అవగాహన కల్పిస్తామన్నారు. డయేరియా కేసులు పూర్తిగా తగ్గేవరకు వైద్యశాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు.

రూ.11 లక్షల నగదుతో వీహెచ్ఏ పరారీ

కుందుర్పి, జూన్ 30: మండలంలోని జంబుగుంపల రైతు భరోసా కేంద్రంలో వీహెచ్ఏగా పనిచేస్తున్న ప్రవీణ్ రాయితీ విత్తనాలు విక్రయించిన రూ.11,23,420సొమ్ముతో పరారయ్యాడు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి రావడంతో ఆదివారం మండల వ్యవసాయ అధికారి స్థానిక కుందుర్పి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వ్యవసాయ అధికారి తెలిపిన మేరకు జంబుగుంపల గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో 300 క్వింటాళ్ల విత్తన వేరుశనగ కాయలను రైతులకు పంపిణీ చేశారు. అందుకు సంబంధించిన నగదును రూ.17,23,420 విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ ప్రవీణ్ ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంది. అందులో రూ.5.9 లక్షలు మాత్రమే చెల్లించాడు. మిగిలిన సొమ్మును జమ చేయలేదు. 15 రోజులుగా అతను అందుబాటులోకి రాకపోవడంతో వ్యక్తిగత సమస్యలతో సెలవులో ఉన్నారని అధికారులు భావించారు. ఫోన్ చేసినా అందుబాటులోకి రాకపోవడంతో అనుమానంతో మండల వ్యవసాయ అధికారి మహేష్ అప్రమత్తమై ఎస్ఐ వెంకటస్వామికి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మేనమామను హతమార్చిన అల్లుడు

కళ్యాణదుర్గంరూరల్, జూన్ 30: వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని మామను మైనరైన అల్లుడు హత్య చేసినట్లు పట్టణ సీఐ హరినాథ తెలిపారు. ఆదివారం విలేకరుల సమావేశంలో హత్య వివరాలను సీఐ వెల్లడించారు. మున్సిపల్ పరిధిలోని కురాకులతోట సమీపంలో శుక్రవారం సాయంత్రం చెలిగొత్తుల కొండ వద్ద రక్తపుమడుగులో ఉన్న మృతదేహాన్ని చూసిన పశువుల కాపరులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారించగా మృతిచెందిన వ్యక్తి కురాకుల తోట గ్రామానికి చెందిన వన్నూరుస్వామిగా గుర్తించారు. 24 గంటల్లోనే కేసును ఛేదించారు. వన్నూరుస్వామి అల్లుడే హత్య చేసినట్లు విచారణలో తేలింది. పథకం ప్రకారమే ద్విచక్రవాహనంలో చెలిగొత్తుల కొండకు తీసుకెళ్లి పూటుగా మద్యం తాగించి, వెంట తెచ్చుకున్న సూరకత్తితో గొంతుకోసి హత్య చేసినట్లు సీఐ తెలిపారు. ఆదివారం మారుతి వేబ్రిడ్జి వద్ద ఉన్న ఆ బాలుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించిట్లు తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ హరినాథ

విమర్శలెన్నొచ్చినా.. వెనకేసుకొస్తాం..!

- ఏడాదిలో లెక్కలేనన్ని ఆరోపణలు
- 2023 జూన్, జూలైలో అడ్డదారిలో జీతాలు డ్రా
- విచారణకు ఆదేశించిన పీఆర్ కమిషనర్
- తొక్కిపెట్టిన జడ్పీ ఉన్నతాధికారులు
- జడ్పీ డిప్యూటీ సీఈఓపై చర్యలు శూన్యం



జడ్పీ కార్యాలయం


అనంతపురం విద్య, జూన్ 30: విమర్శలు ఎన్ని వచ్చినా... వెనకేసుకొస్తారు. జడ్పీటీసీలను హేళన చేసినా.... ఆఖరికి పాలకవర్గం వద్దని చెప్పినా...పెద్దపీట వేస్తారు. ఇటీవల జడ్పీటీసీలు, ఎంపీపీలు సాక్షాత్తు స్టాండింగ్ కమిటీలోనే సరెండర్ చేయాలని పట్టుబట్టినా....పక్కనబెట్టేస్తారు. ఇష్టారాజ్యంగా జీతాలు, అలవెన్సులు డ్రా చేస్తే... సాక్షాత్తు.. పంచాయతీ రాజ్ కమిషనర్ సైతం విచారణకు ఆదేశించినా... పట్టించుకోరు. విచారణను తొక్కి పెట్టేస్తారు. లోకాయుక్తాకు ఫిర్యాదులు వెళ్లినా... పక్కపెట్టేస్తారు. ఆమె జడ్పీకి వచ్చిన ఏడాది కాలంలో అనేక విమర్శలు, ఆరోపణలు...అయినా...చర్యలు తీసుకోవడంలో మాత్రం మీనమేషాలు. జడ్పీ డిప్యూటీ సీఈఓ లలితా భాయిని జడ్పీ ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టరేట్ వర్గాలు వెనకేసుకు రావడంపై అనేక ఆరోపణలు వస్తున్నాయి.

ఐదు నెలల కిందటే విచారణకు ఆదేశాలు...

సుమారు ఏడాది కిందట డిప్యూటీ సీఈఓ లలితాబాయి జడ్పీకి వచ్చారు. కర్నూలు జిల్లాలో పనిచేస్తున్న ఆమె ఈ జిల్లాకు బదిలీపై వచ్చారు. అయితే ఆమె చేరికపై అనేక విమర్శలు వచ్చాయి. అప్పటి సీఈఓ భాస్కర్‌రెడ్డి డిప్యూటీ సీఈఓ విధుల్లో చేరిక, పంచాయతీరాజ్ కమిషనర్‌కు పంపిన రిపోర్ట్‌పై అనేక విమర్శలు వచ్చాయి. డిప్యూటీ సీఈఓ విధుల్లో చేరిన తేదీలకు, జీతాలు, ఇతర అలవెన్సులు డ్రా చేసిన దానికి పొంతన లేకపోవడంతో....ఆమెపై ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో సుమారు 5 నెలల కిందట ఆమెపై విచారణ చేయాలంటూ...పీఆర్ కమిషనర్ ఆదేశాలు ఇచ్చారు. 2023 జూన్, జులై జీతాల, ఇతర అలవెన్సులు డ్రా చేయడంపై విచారణ చేయాలంటూ.....అనంతపురం జిల్లా కలెక్టర్‌ను ఆదేశిస్తూ...పీఆర్ కమిషనర్ సూర్యకుమారి ఉత్తర్వులు ఇచ్చారు. అప్పటి కలెక్టర్ గౌతమి ఈ అంశాన్ని పూర్తిగా పక్కనబెట్టారంటూ అప్పట్లో జోరుగా ప్రచారం సాగింది. నామమాత్రంగా విచారణ చేయాలన్నట్టుగా అప్పట్లో జడ్పీ సీఈఓను ఆదేశించినట్టు తెలుస్తోంది. అయితే ఐదు మాసాలు గడిచినా...ఇంత వరకూ ఈ అంశంలో పురోగతి లేదు.

లోకాయుక్తాకు ఫిర్యాదు...

జడ్పీ పరిధిలో ఇష్టారాజ్యంగా బిల్లులు చేయడంపై లోకయుక్తాకు ఫిర్యాదులు వెళ్లాయి. గతంలో పలువురు వైకాపా ఎమ్మెల్యేలు, వారి అనుయాకులకు సంబంధించిన సంస్థలకు గతంలో ఎడాపెడా బిల్లులు చేశారు. ఓ అండ్ ఎం బిల్లులను ఏ మాత్రం నిబంధనలు పాటించకుండా చెల్లింపు చేశారు. కోట్ల రూపాయల బిల్లులు చెల్లింపులు జరిగాయి. అప్పటి కొందరు వైకాపా ఎమ్మెల్యేలు, వారి అనుచరులకు సంబంధించిన సంస్థలు... తాగునీటి శుద్ధి కేంద్రాల్లో పనిచేసే కార్మికుల జీతాలు, పీఎఫ్, ఈఎస్ఐలో అనేక గోల్‌మాల్ వ్యవహారాలు నడిపాయి. వీటిపై విచారణ జరుగుతోంది. అయితే విచారణ పూర్తికాకుండానే...అడ్డగోలుగా కోట్ల రూపాయల బిల్లులు చెల్లింపు జరిగాయి. ఈ వ్యవహారంలో కూడా జడ్పీ డిప్యూటీ సీఈఓపై లోకాయుక్తాకు ఫిర్యాదులు వెళ్లాయి. ఇలా ఏడాది కాలంలో జడ్పీ డిప్యూటీ సీఈఓపై అనేక విమర్శలు, ఆరోపణలు వచ్చినా....జడ్పీ ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టరేట్ వర్గాలు చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వచ్చాయి. ప్రభుత్వం మారినా... చర్యలు తీసుకోకపోవడం చూస్తుంటే... ఉన్నతాధికారుల వైఖరేంటో...ఇట్టే అర్థమవుతోంది. ఇప్పటికైనా విచారణ వేగవంతం చేస్తారా..? తొక్కిపెడతారేమో చూడాలి.



విచారణ చేయాలని పీఆర్ కమిషన్ ఇచ్చిన ఉత్తర్వులు

ఉద్యోగ భద్రత కల్పించాలి

● ఎంపీఈఓల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజు

అనంతపురం అర్బన్, జూన్ 30: వ్యవసాయ శాఖలో కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్న ఎంపీఈఓలకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజు కోరారు. అనంతపురంలోని ఓ ప్రైవేటు కళాశాల సమావేశపు హాల్‌లో ఆదివారం ఎంపీఈఓల సంఘం జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడారు. ఎంపీఈఓలకు ఎంటీఎస్‌గానీ, హెచ్‌ఆర్ పాలసీతో రూ.35వేల వేతనం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి 1500 హెక్టార్లకు ఒక ఎంపీఈఓను నియమించి, అందరికీ న్యాయం చేయాలన్నారు. చిత్తూరు జిల్లాలో ఓడీపై పనిచేస్తున్న అనంత జిల్లాకు చెందిన ఎంపీఈఓలను తిరిగి జిల్లాలో పోస్టింగ్ ఇప్పించాలన్నారు. ఓడీపై వెళ్లకపోవడంతో టర్మినేట్ చేసిన వారికి తిరిగి ఉద్యోగ అవకాశం కల్పించాలన్నారు. ఏటా ఆలస్యంగా రెన్యూవల్ చేయడంతో పాటు సకాలంలో వేతనాలు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంజినొరెడ్డి, ఎంపీఈఓల సంఘం జిల్లా అధ్యక్షుడు రవి, నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల ఖర్చు తుది అకౌంట్స్ సమర్పించండి

● అభ్యర్థులు, పార్టీలకు వ్యయ పరిశీలకుల సూచన

అనంతపురం టౌన్, జూన్30: సార్వత్రిక ఎన్నికలలో పోటీచేసిన అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ఎన్నికల వ్యయ ఖర్చుకు సంబంధించిన తుది అకౌంట్స్ వివరాలను అందించాలని కేంద్ర ఎన్నికల వ్యయ పరిశీలకులు విలాస్ వి, షిండే, నితిన్‌అగర్వాల్, రాందాస్ టి, కాలే సూచించారు. ఆదివారం కలెక్టరేట్‌లో పోటీచేసిన అభ్యర్థులు, రాజకీయపార్టీల ప్రతినిధులతో వారు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పరిశీలకులు మాట్లాడుతూ ఎన్నికలు జిల్లాలో ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. అభ్యర్థుల ఖర్చుల అకౌంట్ బుక్స్, రికార్డులు,రిజిష్టర్లను డీఈఎంసీకి సమర్పించాల్సి ఉంటుందన్నారు. జూలై 3వ తేదీలోగా ఈప్రక్రియ పూర్తి కావాలన్నారు. ఏదైనా అభ్యంతరాలు, అనుమానాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. రిజిష్టర్లు, ఈసందర్భంగా కలెక్టర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో చివరిఘట్టానికి చేరుకున్నామన్నారు. కౌంటింగ్ ప్రక్రియ ముగిసిన నెలరోజుల లోగా ఖర్చుల వివరాలు అందించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీసీఓ అరుణకుమారి, ఆర్డీఓలు గ్రంధి వెంకటేష్, శ్రీనివాసులు రెడ్డి, శిరీషా, పోటీచేసిన అభ్యర్థులు, రాజకీయపార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేంద్ర ఎన్నికల వ్యయ పరిశీలకులు విలాస్ వి, షిండే తదితరులు

జాతీయ రెఫరీలుగా జిల్లా కోచ్‌లు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 30: జాతీయ తైక్వాండో రెఫరీలుగా(అంపైర్లు) జిల్లాకు చెందిన కోచ్‌లు మునీంద్ర, నవీన్‌చంద్రలు అర్హత సాధించారు. జూన్ నెల 28, 29వతేదీల్లో విశాఖపట్నంలో నిర్వహించిన రెఫరీల ఎంపిక పోటీల్లో వీరు ఈ అర్హత సాధించారు. జిల్లా తైక్వాండో సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోపాల్‌రెడ్డి, గురుస్వామి, కార్యనిర్వాహక కార్యదర్శి శాంతరాజ్‌లు వారికి అభినందనలు తెలిపారు.



మునీంద్ర, నవీన్‌చంద్ర

మహిళ ఆత్మహత్య

అనంతపురం క్రైం, జూన్30: భర్త, అత్త వేధింపులు భరించలేక మహిళ ఆత్మహత్య చేసుకుంది. త్రీటౌన్ పోలీసులు తెలిపిన మేరకు... శ్రీనివాసనగర్‌కు చెందిన రామకృష్ణ బార్బర్ షాపు నిర్వహిస్తున్నాడు. ఇతనికి ఎనిమిది నెలల క్రితం బళ్లారికి చెందిన పవిత్ర(19)తో వివాహమైంది. కొంతకాలంగా భర్త, అత్త లక్ష్మీదేవి వేధింపులు అధికమయ్యాయి. ఈ క్రమంలో మనస్తాపం చెందిన పవిత్ర ఆదివారం తన ఇంట్లోని గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతి చెందింది. బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

నది ప్రవహిస్తే.. ఎక్కడివాళ్లు అక్కడే

- అతితక్కువ ఎత్తులో రోడ్లపై వంతెనలు
- సోమావతి నది పారితే.. రోడ్లపైకి వస్తున్న నీరు
- అప్పుడు రాకపోకలు సాగించలేకపోతున్న పలు గ్రామాల ప్రజలు



సోమావతి నదిపై అతితక్కువ ఎత్తులో ఉన్న ఇనగలూరు వంతెన



ఎత్తులేని నారప్పగారిపల్లి వంతెన

ఓబుళదేవరచెరువు, జూన్ 30: మండలంలోని సున్నంపల్లి, నారప్పగారిపల్లి, ఇనగలూరు ప్రాంతాల ప్రజలకు వర్షాకాలం వస్తే చాలు ఆందోళన మొదలవుతోంది. సోమావతి నది పరివాహక ప్రాంతాల్లో ఈ గ్రామాలు ఉండడం, వాటికి వెళ్లే రోడ్లపై ఎత్తులేని వంతెనలు నిర్మించడం, నదిలో ప్రవహించే నీరు ఆ వంతెనలపైన పారడం, దీని వల్ల ఆ రోడ్లపై రాకపోకలు బంద్ కావడమే ఇందుకు కారణం. నది పారే సమయంలో ఆయా గ్రామాల ప్రజలు ఎక్కడివారు అక్కడే ఉండిపోవాల్సిన దుస్థితి నెలకొంటోంది. మండలకేంద్రానికి అత్యవసర సమయాల్లో వెళ్లాలంటే ఇతర మార్గాల ద్వారా అధిక దూరం ప్రయాణించి చేరుకోవాల్సి వస్తోంది. గతంలో సున్నంపల్లి వద్ద గల వంతెన సోమావతి నీటి ఉధృతికి పూర్తిగా తెగిపోయింది. అప్పట్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తాత్కాలికంగా మరమ్మతులు చేసి, రాకపోకలు కొనసాగిస్తున్నారు. అది మళ్లీ ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. నారప్పగారిపల్లి వంతెన కూడా ఎత్తు తక్కువగా ఉండడంతో నదిపారే సమయంలో ఆ గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. ఇక ఇనగలూరులోని వంతెన పరిస్థితి అంతే. ఇనగలూరులో వంతెనపైకి నీరు వస్తే.. ఆ గ్రామంతో పాటు గొల్లపల్లి గ్రామస్థులు రాకపోకలు బంద్ చేయాల్సిందే. అత్యవసరమైతే మిట్టపల్లి పొలాల దారుల వెంట సుమారు 10 కిలోమీటర్లు చుట్టేసుకుని మండలకేంద్రానికి చేరుకోవాల్సిన పరిస్థితి. నారప్పగారిపల్లి వంతెన మీదకు నీరు వచ్చినప్పుడు ఆ పరిసరాల్లోని రామిరెడ్డిపల్లి, శెట్టివారిపల్లి, బొద్దెలవారిపల్లి, బాబాసాహెబ్‌పల్లి, నల్లగుట్లపల్లి, బోగానివారిపల్లి, మారెవాండ్లపల్లి ప్రాంతాల వారు మండలకేంద్రానికి చేరుకోవాలంటే తుమ్మలకుంట్లపల్లి, కదిరి గట్టు మీదుగా దాదాపు 30కిలోమీటర్లు అదనంగా ప్రయాణించాల్సి వస్తోంది. సున్నంపల్లి వంతెన పరిధిలో సున్నంపల్లి, మలకవారిపల్లి, పెద్దగుట్లపల్లి గ్రామాల ప్రజలు వర్షాకాలంలో అమడగూరు మండలంలోని సంగీతం పల్లి, మహమ్మదాబాద్ మీదుగా దాదాపు 15మీటర్లు తిరిగి ఓడీసీకి చేరుకోవాల్సి వస్తోంది.

2001లో అప్పటి టీడీపీ పాలనలో ఎమ్మెల్యేగా ఉన్న పల్లె రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో నారప్పగారిపల్లి, ఇనగలూరు వంతెనలు నిర్మించారని, నీటి ప్రవాహంతో ఇసుక, చెత్తచెదారం వంతెనల కింద పేరుకుపోవడంతో నీరు పైకి వచ్చి ప్రవహిస్తున్నాయని, గత వైసీపీ ప్రభుత్వంలో వంతెనల ఎత్తు పెంచాలని నాయకులను కోరినా పట్టించుకోలేదని ఆయా గ్రామస్థులు వాపోతున్నారు. ప్రస్తుత వర్షాకాలంలో నీటి ఉధృతి ఎక్కువ కాకముందే కూటమి ప్రభుత్వం వంతెనల ఎత్తు పెంచాలని వారు కోరుతున్నారు.

సున్నంపల్లి వంతెన ఎత్తు పెంచాలి



కొనేళ్ల కిందట సున్నంపల్లి వంతెన కూలింది. దీంతో తాత్కాలికంగా మరమ్మతులు చేసి రాకపోకలు సాగిస్తున్నారు. మళ్లీ వంతెన ఎప్పుడు కూలుతుందో తెలియదు. కనుక వంతెన ఎత్తు పెంచి పునర్నిర్మించాలి. అలా చేయకపోతే సున్నంపల్లి పరిధిలోని గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తప్పవు.

- సులోచన, పెద్దగుట్లపల్లి

ఇంకెన్నాళ్లీ కష్టాలు?



ఏళ్లుగా వర్షాకాలంలో ఇబ్బందులు పడుతున్నాం. వర్షాకాలంలో వంతెనపై నీరు పారితే రోజుల తరబడి రాకపోకలు బంద్ చేయాల్సి వస్తోంది. మాగ్రామ ప్రజలతో పాటు చుట్టుపక్కల గ్రామస్థులు కూడా ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నారప్పగారిపల్లి వంతెనను ఎత్తు పెంచాలి.

- కుంచెపు అజయ్‌కుమార్, నారప్పగారిపల్లి

కొత్త ప్రభుత్వమైనా స్పందించాలి



వర్షాకాలంలో సోమావతి నదిలోనీరు ప్రవహిస్తే చుట్టు పక్కల గ్రామస్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. గత్యంతరం లేక పొలాల గట్లు వెంట కిలోమీటర్ల దూరం వెళ్లి మండలకేంద్రానికి చేరుకోవాల్సిన దుస్థితి నెలకొంటోంది. కూటమి ప్రభుత్వమైనా మా ఇబ్బందులు గుర్తించి వంతెన ఎత్తు పెంచాలి.

-గంగాద్రి, ఇనగలూరు

ధర్మవరానికి నేడు మంత్రి సత్యకుమార్ రాక

- పింఛన్ల పంపిణీలో పాల్గొననున్న వైనం

ధర్మవరం,జూన్ 30: వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ సోమవారం ధర్మవరానికి రానున్నట్టు కూటమి నాయకులు ఆదివారం ప్రకటనలో తెలిపారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాలశ్రీరామ్‌తో కలిసి పింఛన్ల పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొననున్నారన్నారన్నారు. ఉదయం 9:30గంటలకు బత్తలపల్లి మండలం వేల్పుమడుగు గ్రామంలో, 10గంటలకు ధర్మవరం మండలం నాగలూరులో, 10:30కు ధర్మవరం మున్సిపాలిటీలోని 35వ వార్డులో, 10:45కు 36వ వార్డులో, 11 గంటలకు 6వ వార్డులో, 11:15లకు 7వ వార్డు శంకరాపురంలో పింఛన్ల పంపిణీలో పాల్గొననున్నట్లు చెప్పారు. అనంతరం చేనేతలతో ముఖాముఖీ కార్యక్రమంలో పాల్గొంటారని, తర్వాత 19వ వార్డులో ఎస్సీకాలనీలో ప్రజల సమస్యలను అడిగితెలుసుకుంటాని తెలిపారు. ఈ కార్యక్రమాల అనంతరం శారదానగర్‌లోని ఎన్డీఏ కార్యాలయానికి చేరుకుంటారని చెప్పారు.

పింఛన్ల పంపిణీలో పాల్గొననున్న ఎమ్మెల్యే కందికుంట

కదిరి, జూన్ 30: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ సోమవారం నియోజకవర్గ వ్యాప్తంగా జరగనుంది. అన్ని మండలాల్లో జరిగే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొననున్నారు. ఉదయం 6గంటలకు కదిరి పట్టణంలోని మున్సిపల్ కార్యాల యం వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తారు. 6:15కు స్థానిక తిరు వీధు ల్లో పింఛన్ పంపిణీ ప్రారంభిస్తారు. తర్వాత 6:45కు తలుపుల మండలకేంద్రంలో, 7గం టలకు బట్రేపల్లి క్రాస్‌లో, 7:45కు కుటాగుళ్లలో, 8:15కు కదిరి మున్సిపాలిటీలోకి కుమ్మర వాండ్లపల్లిలో పింఛన్ల పంపిణీలో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 12గంటలకు నల్లచెరువు మండల కేంద్రంలో, 12:30కు తనకల్లులో, 1:15కు కదిరి రూరల్ మండలం కుమ్మర వాండ్లపల్లిలో, 2గంట లకు గాండ్లపెంటలో, 3గంటలకు ఎన్పీకుంటలో పింఛన్ల పంపిణీలో పాల్గొంటారని ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ఆదివారం ప్రకటన విడుదల చేశారు.

నేడు ఎక్స్‌అఫీషియో మెంబర్‌గా ప్రమాణ స్వీకారం

మున్సిపాలిటీలో కదిరి ఎమ్మెల్యే కందికుంట ఎక్స్‌అఫీషియో మెంబర్‌గా ప్రమాణ స్వీకారం చేస్తారని మున్సిపల్ కమిషనర్ కిరణ్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి కౌన్సిలర్లు హాజరుకావాలని కోరారు.

నేడు నల్లమాడకు ఎమ్మెల్యే పల్లె సింధూర రాక

నల్లమాడ, జూన్ 30: మండలవ్యాప్తంగా సోమవారం పింఛన్ల పంపిణీ చేయనున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ మైలే శివశంకర్ ప్రకటనలో తెలిపారు. మండలకేంద్రంలో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి, బాలాజీ విద్యాసంస్థల అధినేత పల్లె వెంకటకృష్ణకిశోర్ రెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు చెప్పారు. తర్వాత సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పింఛన్‌దారులకు పింఛన్ అందిస్తారన్నారు. మండల వ్యాప్తంగా 7.222 పింఛన్‌దారులకు రూ.5.05 కోట్లు పంపిణీ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఘనంగా బోగాదమ్మ ఊరేగింపు



గ్రామ వీధుల్లో ఊరేగుతున్న బోగాదమ్మ అమ్మవారు

గాండ్లపెంట, జూన్ 30: మండలంలోని తుమ్మలబైలు పంచాయతీ సాదులవాండ్లపల్లిలో గల బోగాదమ్మ ఆలయ ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం తెల్లవారుజామున అర్చకులు అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని రథంలో కొలువుదీర్చి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. తర్వాత ఉదయం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు, పూజలు చేశారు. భక్తులు జ్యోతులు, బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వేడుకలకు ఇతర ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు.

ఉత్సాహంగా క్రికెట్ టోర్నీ



క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు

కదిరిఅర్బన్, జూన్ 30: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఆదివారం నిర్వహించిన క్రికెట్ టోర్నీ ఉత్సాహంగా సాగింది. కోచింగ్ క్యాంపు జట్టు, సాధన స్కూల్ జట్టు మధ్య పోటీ సాగింది. మొదట బ్యాటింగ్ చేసిన కోచింగ్ క్యాంపు జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 119 పరుగులు చేశారు. అనంతరం సాధన స్కూల్ జట్టు బ్యాటింగ్ చేసి 110 పరుగులకు ఆలౌట్ ఆయ్యారు. విజయం సాధించిన కోచింగ్ క్యాంపు జట్టును క్రీడాకారులు అభినందించారు.

మహిళపై అత్యాచారయత్నం

కదిరిఅర్బన్, జూన్ 30: మండలంలోని ఓ గ్రామంలో మహిళపై అత్యాచార యత్నం జరిగిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు ఆదివారం తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన భానుపత్రాప్‌రెడ్డి అదే గ్రామంలో ఇంటిలో ఒంటరిగా ఉన్న మహిళపై శనివారం రాత్రి అత్యాచారం చేసేందుకు యత్నించాడు. ఆమె గట్టిగా కేకలు వేయడంతో భానుప్రతాప్‌రెడ్డి పరుగులు తీశాడు. ఈమేరకు బాధితురాలు భర్తతో కలిసి ఆదివారం రూరల్ పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు సీఐ మోహన్ తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



కురుబ బాలాజీ (ఫైల్)

హిందూపురం(పరిగి), జూన్ 30: మండలపరిధి లోని వన్నంపల్లిలో కురుబ బాలాజీ(24) అనే యువకుడు విద్యుదాఘాతంతతో మృతిచెం దినట్లు ఏఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. వన్నంపల్లికి చెంది న బాలాజీ పెనుకొండ కియ మోటార్స్‌లో పనిచేస్తూ అక్కడే అద్దె ఇంట్లో ఉంటున్నాడు. ఆదివారం సెలవు కావడంతో వన్నంపల్లికి ఇంటికి వచ్చాడు. ఇంటివద్ద ఉన్న నీటి తొట్టె నుంచి మధ్యాహ్నం 12గంటల సమయంలో నీరు తీస్తుం డగా మోటారు వైరు నుంచి విద్యుదాఘాతమై అక్కడిక క్కడే మృతిచెందాడు. మృతుడి తల్లి జయసుధ, అమ్మమ్మ సాదమ్మ కూలి పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. కొంతకాల క్రితం తండ్రి మరణించినట్లు సమాచారం. ఈ మేరకు కేసు నమోదుచేసి, మృతదేహాన్ని పోస్టమార్టం నిమిత్తం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఏఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

తాడిపత్రిటౌన్, జూన్ 30: పట్టణ సమీపంలోని యల్లనూరురైల్వేగేట్ వద్ద ఆదివారం కడపజిల్లా కొండాపురం మండలం చౌవిటిపల్లికి చెందిన రవీంద్ర (32) రైలుకింద పడి ఆత్మహత్య చేస్తున్నట్లు రైల్వే ఎస్ఐ నాగప్ప తెలిపారు. రవీంద్ర కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలం నుంచి మద్యానికి బానిసయ్యాడు. జీవితంపై విరక్తిచెందిన రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రవీంద్రకు భార్య ఆదిలక్ష్మితోపాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

నేడు ప్రజాఫిర్యాదుల స్వీకరణ

పుట్టపర్తిరూరల్, జూన్ 30: జిల్లాపోలీసు కార్యాయంలో సోమవారం ప్రజాఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎస్పీ మాధవరెడ్డి ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా నూతనంగా ఏర్పడిన ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజాసమస్యల పరిష్కారానికి వినతిపత్రాలు స్వీకరిస్తామన్నారు. అవకాశాన్ని జిల్లాలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇంటి వద్దనే పింఛన్ల పంపిణీ

పుట్టపర్తిరూరల్, జూన్ 30: మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో సోమవారం ఇంటింటికీ వెళ్లి పింఛన్ పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీఓ నాగేశ్వరరెడ్డి ప్రకటనలో పేర్కొన్నారు. అమగొండపాలెం, చెర్లోపల్లి, దిగువచెర్లోపల్లి, జగరాజుపల్లి, నిడిమామిడి, పెడపల్లి, పెడపల్లి 2, రాచువారిపల్లి, వెంగళమ్మచెరువు, వెంకటగారిపల్లి సచివాలయాల పరిధిలో ఉన్న పింఛన్‌దారులకు ఇంటి వద్దకే వచ్చి పింఛన్లు అందిస్తారన్నారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 4 గంటలకు వరకు సచివాలయ సిబ్బంది అందచేస్తారని తెలిపారు. ఎవ్వరూ సచివాలయాలకు రానవసరం లేదని ఎంపీడీఓ పేర్కొన్నారు.

నంబులపూలకుంట: మండలంలో సోమవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు ఈఓఆర్డీ మనోహర్ బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలవ్యాప్తంగా 4,790 పింఛన్‌దారులకు 3,26,14,000 రూపాయలు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. సచివాలయ సిబ్బంది పింఛన్‌దారుల ఇంటి వద్దకు వెళ్లి అందించనున్నట్లు పేర్కొన్నారు.

నల్లచెరువు: మండలవ్యాప్తంగా సోమవారం ఇంటింటికీ వెళ్లి పింఛన్ల పంపిణీ చేయనున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ రాజశేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద జరిగే కార్యక్రమంలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరు కానున్నట్లు చెప్పారు. చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పింఛన్లను పంపిణీ చేయనున్నారని అన్నారు.

పింఛన్ల పంపిణీపై గ్రామాల్లో ప్రచారం

నంబులపూలకుంట, జూన్ 30: మండలంలోని పడమర నడింపల్లి పంచాయతీ పరిధిలోని అన్నిగ్రామాల్లో సోమవారం సచివాలయ సిబ్బంది ఇంటి వద్దకే వచ్చి పింఛన్లు పంపిణీ చేస్తారంటూ ఆదివారం ఆటోకు మైక్ కట్టి ప్రచారం చేశారు. టీడీపీ బూత్ కన్వీనర్ సోమేనాయక్, నాయకులు పోమేనాయక్ నాయక్, ఈశ్వర్‌నాయక్, రత్నమయ్య, రామస్వామినాయక్ ఈ ప్రచారం చేయించారు. వారు మాట్లాడుతూ.. ఎన్నికల హామీల్లో చెప్పిన విధంగా సీఎం చంద్రబాబు మాట నిలుపుకుంటున్నారని తెలిపారు.



పడమరనడింపల్లిలో ప్రచారం చేస్తున్న దృశ్యం

మండెంవారిపల్లిలో ఎమ్మెల్యే కందికుంట పర్యటన

నంబులపూలకుంట, జూన్ 30: మండలంలోని ఎన్పీకుంట పంచాయతీ మండెంవారిపల్లిలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌కు ఆదివారం పర్యటించారు. ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత మొదటిసారిగా ఆయన గ్రామానికి వచ్చారు. దీంతో కూటమి శ్రేణులు బాణసంచా కాల్చి, పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. మహిళలు హారతి పట్టారు. ఎమ్మెల్యే స్థానిక సీతారాముల ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి విందులో పాల్గొన్నారు. తర్వాత గ్రామ పెద్దలు పలు సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ అందించాలని, అసైన్డు భూమిని సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలిప్పించాలని, గ్రామానికి రోడ్డు వేయించాలని విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్యలన్నీ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు దండే రవి, గంగిరెడ్డి, నరసింహులు, మల్లికార్జునాయుడు, చలపతి నాయుడు, శేషాద్రినాయుడు, గంగాధర్‌నాయుడు, ధర్మానాయుడు, అంజనప్పనాయుడు బీజేపీ మైనార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాబ్‌జాన్ తదితరులు పాల్గొన్నారు.



మండెంవారిపల్లిలో పర్యటిస్తున్నఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

పింఛన్లను తీసుకొచ్చిన ఘనత టీడీపీదే: పల్లె

పుట్టపర్తి, జూన్ 30: సామాజిక భద్రతపేరిట పింఛన్‌లను ప్రారంభించింది నాటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు అని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అప్పట్లో ఎన్టీఆర్ రూ.35తో పింఛన్‌ను ప్రారంభించారని గుర్తు చేశారు. ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు వాటిని రూ.4వేలు చేశారని పేర్కొన్నారు. చంద్రబాబు ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు రూ.3వేల పింఛన్‌ను రూ.4వేలు చేశారని తెలిపారు. ఈ పింఛన్ ద్వారా లక్షలాది మందికి ఊరట కలుగుతుందన్నారు. సోమవారం ఉదయం 6గంటలకే కొత్తచెరువులో ఎమ్మెల్యే పల్లెసింధూరారెడ్డి చేతులమీదుగా పింఛన్‌పంపిణీని ప్రారంభించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు పాల్గొనాలని ఆయన కోరారు.

హామీ నెరవేర్చనున్న చంద్రబాబు

కదిరి, (అమడగూరు): ఎన్నికల్లో ఇచ్చిన హామీని సీఎం చంద్రబాబు నెరవేర్చనున్నారని, చెప్పిన మేరకు రూ. 4 వేలచొప్పున పింఛన్‌ను అందించనున్నారని టీడీపీ మండలకన్వీనర్ గోపాల్‌రెడ్డి తెలిపారు. అమడగూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు ఎన్నికల ప్రచారంలో పింఛన్‌ను రూ.4 వేలకు పెంచుతానని హామీ ఇచ్చారని, అధికారంలోకి రాగానే చెప్పిన మేరకు వాటిని పెంచి ఇవ్వనున్నారని తెలిపారు. సోమవారం జరగనున్న పింఛన్ల పంపిణీని టీడీపీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ కృష్ణమూర్తి, నాయకులు కృష్ణారెడ్డి, రాజారెడ్డి, బూత్ కన్వీనర్లు కుమార్‌రెడ్డి, చంద్ర, రమణ, గాయత్రి పాల్గొన్నారు.

యూపీ వర్కర్లతో ఉపాధికి గండి

- కార్పెంటర్ల ఆవేదన
- పట్టణంలో బైక్‌ర్యాలీ



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న కార్పెంటర్లు

ధర్మవరం, జూన్ 30: పట్టణంలో పలువురు స్వార్థపరులు యూపీ వర్కర్స్‌ను తీసుకొచ్చి మా ఉపాధికి గండికొడుతున్నారని కార్పెంటర్లు వాపోయారు. ఈ చర్యలను నిరసిస్తూ ఆదివారం భారీగా బైకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ యర్రగుంటసర్కిల్ నుంచి ఆర్టీసీబస్టాండ్, కాలేజీ , కళాజ్యోతి, ఎన్టీఆర్, గాంధీసర్కిళ్లు, కదిరిగేటు మీదుగా ఎన్డీఏ కార్యాలయం వరకు సాగింది. ఈ సందర్భంగా కార్పెంటర్లు మాట్లాడుతూ.. కరోనా తరువాత తమకు పనులు తక్కువయ్యాయన్నారు. ఎప్పుడో ఒకసారి దొరికే అరకొర పనులతో కాలం వెల్లదీస్తున్నామన్నారు. ఇలాంటి తరుణంలో కొందరు వ్యక్తులు స్వార్థపూరిత చర్యలకు పాల్పడుతున్నారన్నారు. యూపీ నుంచి కార్మికులను తీసుకొచ్చి తక్కువ రేట్లకు కార్పెంటర్ పనులు చేయిస్తున్నారన్నారు. దీంతో తాము ఉపాధిని కోల్పోతున్నామని వాపోయారు. ప్రతి ఒక్కరు అసోసియేషన్ నిబంధనలకు కట్టుబడి ఉండాలని, తమ ఉపాధికి ఇబ్బంది కల్గించకూడదని పేర్కొన్నారు.

4న విద్యాసంస్థల బంద్

హిందూపురం అర్బన్, జూన్ 30: దేశవ్యాప్తంగా నెలకొన్న విద్యా సమస్యలై ఈనెల 4వ తేదీన దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్‌కు పిలుపనిచ్చినట్లు ఐఖ్య విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చినట్లు ఓ ప్రకటన ద్వారా తెలిపారు. ఇటీవల నీట్ పరీక్షలు రాసి నష్టపోయిన విద్యార్థు లకు కేంద్ర ప్రభుత్వం నష్ట పరిహారం ఇవ్వాలని, పీహెచ్ డీ అడ్మిషన్‌ల కోసం ఇటీవల ఆమోదించిన తప్పనిసరి నెట్ స్కోర్ విధానాన్ని వెనక్కు తీసుకోవాలన్నారు. టీఐఎస్ఎస్ ముంబాయి, ఐఐటీ ముంబాయి నుంచి హైదరా బాద్ సెంట్రల్ యూనివర్సిటీ వరకు విద్యార్థి సంఘాల నేతలపై అక్రమ కేసులు నిర్బంధాలు తొలగించాలని, యూనివర్సిటీల్లో స్వేచ్ఛ వక్రీకరణ, ప్రజాస్వామ్య అణిచి వేత చర్యలు ఆపాలన్నారు. అలాగే పాఠశాలల మూసివే తలు ఆపాలని, కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న పరీక్షల నిర్వహణ రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలనే పలు విషయాలపై ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, పీడీఎస్‌ఓ, ఏఐఎస్ఏ, ఎన్ఎస్‌యూఐ, పీడీఎస్ఓ ఆధ్వర్యంలో బంద్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నూతన క్రిమినల్ చట్టాలను రద్దు చేయాలి

అనంతపురం కల్చరల్, జూన్ 30: ప్రజాస్వామ్య హక్కులను హరించేలా జూలై 1 నుంచి బీజేపీ ప్రభుత్వం అమలు చేయనున్న మూడు నూతన క్రిమినల్ చట్టాలను రద్దు చేయాలని పౌర చైతన్య వేదిక రాష్ట్ర ఇన్చార్జి, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు డిమాండ్ చేశారు. ఆదివారం పౌర చైతన్యవేదిక ఆధ్వర్యంలో క్లాక్‌టవర్ వద్ద నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా గోవిందరాజులు మాట్లాడుతూ... నూతన చట్టాల గురించి సమాజంలో ఎటువంటి చర్చ లేకుండా, అత్యంత నిరంకుశంగా సోమవారం నుంచి నూతన క్రిమినల్ చట్టాలను అమలు చేస్తామన్న బీజేపీ ప్రభుత్వ నిర్ణయాన్ని పౌర చైతన్య వేదిక వ్యతిరేకిస్తోందన్నారు. ఇప్పటికే ఉన్న సీపీసీ, సీఆర్పీసీ, క్రిమినల్ ఎవిడెన్స్ యాక్ట్ నేర చట్టాల స్థానంలో భారతీయ నాగరిక బీఎన్ఎస్, భారతీయ నాగరిక్ శిక్ష, సన్హిత బీఎన్ఎసస్, బీఎస్ఏ అనే కొత్తపేర్లతో చట్టాలను తీసుకొస్తున్నారన్నారు. ఈ చట్టాలు ప్రజాస్వామ్య హక్కులను హరిస్తాయని, ప్రజల నిరసనలు, చట్ట వ్యతిరేకం కాబోతున్నాయని వాపో యారు. ప్రజా ఉద్యమాలు పెరగకుండా అణచివే యడానికే ఈ చట్టాల ను ఉపయోగిస్తారని విమర్శించారు. కార్యక్రమంలో పౌర చైతన్య వేదిక జిల్లా ఇన్చార్జి రాఘవేంద్ర, నాయకులు, ప్రజా స్వామ్యవాదులు పాల్గొన్నారు.

కాళికాంబ, కమలేశ్వరుడికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో కాళికాదేవి, కమలేశ్వరస్వామి

రొళ్ల, జూన్ 30: మండలపరిధిలోని రత్నగిరిలో వెలిసిన కాళికాదేవి, కమలేశ్వరస్వామికి ఆదివారం విశేష పూజలు, అర్చనలు నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు ప్రకాశాచార్ తెలిపారు. చుట్టుపక్కల గ్రామాల నుంచే కాకుండా సమీప కర్ణాటక ప్రాంతం నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామిని దర్శించుకుని విశేష పూజలు జరిపించారు.

4న విద్యాసంస్థల బంద్

హిందూపురం అర్బన్, జూన్ 30: దేశవ్యాప్తంగా నెలకొన్న విద్యాసమస్యలపై 4వ తేదీన విద్యా సంస్థల బంద్‌కు పిలుపునిచ్చినట్లు ఐక్యవిద్యార్థి సంఘాల నాయకులు ప్రకటన ద్వారా తెలిపారు. ఇటీవల నీట్ పరీక్షలు రాసి నష్టపోయిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం నష్ట పరిహారం ఇవ్వాలని, పీహెచ్ డీ అడ్మిషన్‌ల కోసం ఇటీవల ఆమోదించిన తప్పనిసరి నెట్ స్కోర్ విధానాన్ని వెనక్కు తీసుకోవాలన్నారు. టీఐ ఎస్‌ఎస్ ముంబాయి, ఐఐటీ ముంబాయి నుంచి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వరకు విద్యార్థి సంఘాల నేతలపై అక్రమ కేసులు నిర్బంధాలు తొలగించాలని, యూనివర్సిటీల్లో స్వేచ్ఛ వక్రీకరణ, ప్రజాస్వామ్య అణిచి వేత చర్యలు ఆపాలన్నారు. పాఠశాలల మూసివేతలు ఆపాలని, కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న పరీక్షల నిర్వహణ రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలనే పలు విషయాలపై ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, పీడీఎస్‌ఏ, ఏఐఎస్ఏ, ఎన్ఎస్‌యూఐ, పీడీఎస్ఓ ఆధ్వర్యంలో బంద్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

చట్టాలపై అవగాహన ఉండాలి: ఎస్ఐ

లేపాక్షి, జూన్ 30 : ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ గోపి అన్నారు. మండల పరిధిలోని కంచిసముద్రం గ్రామంలో ఆదివారం చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, ముఖ్యంగా మహిళలు గృహహింస తదితర వేధింపులపై ధైర్యంగా పోరాడాలన్నారు. ఎటువంటి ఇబ్బందులు కలిగినా ఫోన్ నంబరు 100కు చేయాలని సూచించారు. గ్రామంలో ఎటువంటి గొడవలు జరిగినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని గ్రామస్థులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, పోలీసులు పాల్గొన్నారు.

వ్యసనాలతో కుటుంబాలు నాశనం

అగళి, జూన్ 30: మద్యం, జూదానికి బానిసలై కుటుంబాలను నాశనం చేసుకోవద్దని ఎస్ఐ వీరేష్ గ్రామస్థులకు సూచించారు. ఆయన ఆదివారం మండలపరిధిలోని కోడిపల్లి ఎస్సీ కాలనీలో పర్యటించి ఆ గ్రామస్థులతో మాట్లాడారు. నేటికీ కొంత మందిలో మార్పు రావడం లేదని, జూదం వల్ల కుటుంబాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. ప్రతి ఒక్కరూ చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, పిల్లలను విద్యావంతులను చేయాలని సూచించారు. అక్రమ మద్యం, జూదాన్ని నివారించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కర్ణాటక మద్యం, జూదం, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా ఉండాలన్నారు. ఎస్ఐ వెంట సిబ్బంది, ఎస్సీ కాలనీవాసులున్నారు.

మహిళపై అత్యాచారయత్నం

కదిరిఅర్బన్, జూన్ 30: మండలంలోని ఓ గ్రామంలో మహిళపై అత్యాచార యత్నం జరిగిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు ఆదివారం తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన భానుప్రతాప్‌రెడ్డి అదే గ్రామంలో ఇంటిలో ఒంటరిగా ఉన్న మహిళపై శనివారం రాత్రి అత్యాచారం చేసేందుకు యత్నించాడు. ఆమె గట్టిగా కేకలు వేయడంతో భానుప్రతాప్‌రెడ్డి పరుగులు తీశాడు. ఈమేరకు బాధితురాలు భర్తతో కలిసి ఆదివారం రూరల్ పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



బాలాజీ (ఫైల్)

హిందూపురం(పరిగి), జూన్ 30: మండలపరిధిలోని వన్నంపల్లిలో కురుబ బాలాజీ(24) అనే యువకుడు విద్యుదాఘాతంతో మృతిచెందినట్లు ఏఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. వన్నంపల్లికి చెందిన బాలాజీ పెనుకొండ కియ మోటార్స్‌లో పనిచేస్తూ అక్కడే అద్దె ఇంట్లో ఉంటున్నాడు. ఆదివారం సెలవు కావడంతో వన్నంపల్లికి ఇంటికి వచ్చాడు. ఇంటివద్ద ఉన్న నీటి తొట్టె నుంచి మధ్యాహ్నం 12గంటల సమయంలో నీరు తీస్తుండగా మోటారు వైరు నుంచి విద్యుదాఘాతమై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తల్లి జయసుధ, అమ్మమ్మ సాదమ్మ కూలి పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. కొంతకాల క్రితం తండ్రి మరణించినట్లు సమాచారం. ఈ మేరకు కేసు నమోదుచేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఏఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

పేకాడుతున్న పదిమంది అరెస్ట్

రూ.1.07లక్షలు స్వాధీనం

గుడిబండ, జూన్ 30: మండలంలోని సీసీగిరి గ్రామ సమీపంలో పేకాడుతున్న పది మందిని అరెస్ట్‌చేసి వారి వద్ద నుంచి రూ.1.07లక్షలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రాజ్‌కుమార్, ఎస్ఐ మునిప్రతాప్ ఆదివారం తెలిపారు. మండలంలోని సీసీగిరి సమీపంలో పేకాడుతున్నారన్న సమాచారం రావడంతో జిల్లా ఎస్పీ మాధవరెడ్డి, పెనుకొండ డీఎస్పీ బాజీజాన్ సైదా ఆదేశాల మేరకు సీఐ రాజ్‌కుమార్, ఎస్ఐ మునిప్రతాప్ సిబ్బందితో వెళ్లి జూద కేంద్రంపై దాడిచేశారు. పది మందిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.1.07లక్షల నగదు, 20ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మరో 20మంది పరారైనట్లు తెలిపారు. వారిని గుర్తించి 30మందిపై కేసు నమోదుచేసినట్లు సీఐ తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు, పేకాట, మద్యం విక్రయం తదితర వంటి కార్యక్రమాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఏఎస్ఐ చంద్రశేఖర్, పోలీస్ సిబ్బంది వెంకటేశ్, హరినాథ్, మహ్మద్ రఫీక్, భాస్కర్, శివానంద, నరేష్, పాతన్న, హోమ్‌గార్డులు జగన్నాథ్, చంద్ర, రామప్ప ఉన్నారు.

నేడు పింఛన్ల పండుగ

- లబ్ధిదారుల ఇంటివద్దే పంపిణీ
- ఏర్పాట్లు చేసుకున్న అధికారులు
- పాల్గొననున్న మంత్రి, ఎమ్మెల్యే, టీడీపీ కూటమి నాయకులు



పెనుకొండ రూరల్, జూన్ 30 : ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పెంచిన పింఛన్లను వృద్ధులకు, దివ్యాంగులు, వితంతు వులకు ఇంటివద్దనే అందించనున్నారు. మండల వ్యాప్తంగా 17గ్రామ సచివాలయ పరిధిలో 7,421మంది పింఛన్‌దారులున్నారు. గ్రామ సచివాలయ ఉద్యోగులు సోమవారం ఉదయం 6గంటల నుంచి లబ్ధిదారుల ఇంటివద్దకే వెళ్లి ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు మండలపరిషత్ అధికారులు ఆదివారం తెలిపారు. అందుకు తగిన ఏర్పాటు చేసినట్లు తెలిపారు పింఛన్‌దారులు బ్యాంకులకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. మడకశిర పట్టణంలో 1970మంది, దుద్దేబండ పంచాయతీలో 515, యర్రమంచిలో 354, గుట్టూరులో 534, కోనాపురంలో 400మందికి పింఛన్‌దారులు ఉన్నారు. అలాగే మావటూరు పంచాయతీలో 373 మందికి, నాగలూరులో 645, రాంపురం 541, శెట్టిపల్లి 767, వెంకటగిరిపాళ్యం 295, వెంకటరెడ్డిపల్లి పంచాయతీలో 498మంది పింఛన్‌దారులు ఉన్నారు. వారందరికీ ఇంటివద్దే పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

మడకశిరటౌన్: మడకశిర నగర పంచాయతీ పరిధిలోని శివాలయంలో ఉదయం 6.30 గంటలకు ప్రత్యేక పూజల అనంతరం ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి చేతుల మీదుగా ఇంటి వద్దకే పింఛన్ పంపిణీ కార్యక్రమం ప్రారంభించనున్నట్లు టీడీపీ నియోజకవర్గం మీడియా కోఆర్డినేటర్ రవి ఆదివారం విలేకరులకు తెలిపారు. ఆయన మాట్లాడుతూ... శివాలయంలో 6.30 గంటలకు కార్యక్రమం ప్రారంభిస్తారని తెలిపారు. అక్కడి నుంచి ఆమిదాలగొంది, చందకచర్ల, గౌడనహళ్లి, నీలకంఠాపురం తదితర పంచాయతీ కేంద్రాల్లో పింఛన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. అనంతరం 9 గంటలకు రొళ్ల మండలంలో, 10 గంటలకు అగళి, 11.30 గంటలకు గుడిబండ, 2.30 గంటలకు అమరాపురం మండలాల పరిధిలో పింఛను పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజుతో పాటు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఎన్నికల సమయంలో ముఖ్య మంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు ఏప్రిల్ నెల నుంచి రూ.వెయ్యి చొప్పున పింఛను పెంచారన్నారు. పెంచిన పింఛన్‌తో పాటు మూడు నెలలకు సంబంధించి రూ.3వేలు కలిపి ఈనెల రూ.7వేలు అందించనున్నారన్నారు. ఓ పండుగలా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

మడకశిర(అమరాపురం): ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ నియోజకవర్గం ఇన్‌చార్జ్ గుండుమల తిప్పేస్వామి పాల్గొంటున్నట్లు పార్టీ మండల కన్వీనర్ గణేష్, ఎస్సీ సెల్ నియోజకవర్గం అధ్యక్షుడు జయకుమార్ ఆదివారం తెలిపారు. మధ్యాహ్నం 1గంటకు మండలంలోని హేమావతి, కెంకెర, కాచికుంట, మద్దనకుంట, అమరాపురం, హలుకూరు, బసవనపల్లి, ఆలదపల్లి గ్రామాల్లో వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు పింఛన్లు పంపిణీ చేస్తారని, ఆయా గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు పండుగ వాతావరణంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

రైతులకు ప్రొఫెసర్ త్రిలోచనాశాస్త్రి సూచన



సమావేశంలో మాట్లాడుతున్న త్రిలోచనా శాస్త్రి

పెనుకొండ రూరల్, జూన్ 30 : రైతులు పండించిన పంటలను నేరుగా మార్కెట్‌లోనే విక్రయించాలని, దళారుల చేతిలో మోసపోవద్దని సీసీడీ సంస్థ వ్యవస్థాపకులు ప్రొఫెసర్ త్రిలోచనా శాస్త్రి సూచించారు. మండలంలోని గుట్టూరు సమీపంలో ఆదివారం సీసీడీ శ్రీసత్యసాయి రైతు పరస్పర సహాయక సహకార పరిమిత సమాఖ్య వేరుశనగ మిల్లులో 14వ వార్షికోత్సవ మహాసభ నిర్వహించారు. జిల్లాలోని రైతులు, ఇతర రాష్ట్రాల నుంచి ఎన్‌జీఓలు హాజరయ్యారు. అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రొఫెసర్ త్రిలోచనా శాస్త్రి మాట్లాడుతూ... ఉమ్మడి అనంతపురం జిల్లాలో 33మండలాల్లోని 379గ్రామాల్లో 229 రైతు సహకార సంఘాలు ఏర్పడి, సభ్యులు ఆర్థికంగా ఎదుగుతున్నారన్నారు. రైతులు కలిసికట్టుగా ఉండి తాము సాగుచేసిన పంటలను ప్రాసెసింగ్‌చేసి మార్కెట్‌లో మంచి ధరలు పొందవచ్చన్నారు. అనంతరం సమాఖ్య మిల్లుల నూతన పాలక వర్గాన్ని ఎన్నుకుని వారిని సన్మానించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల నుంచి 2500 మంది రైతులు పాల్గొన్నారు. సమావేశంలో ఏపీ సీడ్స్ మేనేజర్ సుబ్బయ్య, రమణారెడ్డి, అశ్వత్థరెడ్డి, సీసీడీ సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ పరిగి మండల కన్వీనర్‌గా గోవిందరెడ్డి



గోవిందరెడ్డిని అభినందిస్తున్న మంత్రి సవిత

హిందూపురం (పరిగి), జూన్ 30 : బీసీ సంక్షేమం, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత ఆదివారం తనను టీడీపీ పరిగి మండల కన్వీనర్‌గా నియమించారని టీడీపీ నాయకుడు గోవిందరెడ్డి తెలిపారు. మంత్రి పెనుకొండలోని పార్టీ కార్యాలయంలో ఈ మేరకు ప్రకటించినట్లు గోవిందరెడ్డి తెలిపారు. పార్టీ విజయం కోసం కష్టపడి కృషిచేసిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు అందుబాటులో ఉంటామని తెలిపారన్నారు. కార్యక్రమంలో పరిగి మండల నాయకులు బీచిగానిపల్లి పంచాయతీ సర్పంచ్ బాలాజీ, మాజీఎంపీపీ సత్యానారాయణ, ఈశ్వరప్ప, శ్రీనివాసరెడ్డి, నవీన్‌రెడ్డి, పరిటాల శివ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీఈఓల రాష్ట్ర కమిటీలో మడకశిర వాసులు



రాష్ట్ర కమిటీ సభ్యులతో కోశాధికారి పురుషోత్తంరెడ్డి, ఆర్గనైజేషన్ సెక్రెటరీ అశోక్

మడకశిర రూరల్, జూన్ 30 : బహుళ ప్రయోజన విస్తరణ అధికారులు (ఎంపీఈఓలు) రాష్ట్రస్థాయి నూతన కమిటీని ఆదివారం విజయవాడలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మడకశిర ఉద్యోగులు తెలి పారు. ఈ కమిటీలో తమకు చోటు లభించిందని కోశాధికారిగా ఎంపికైన మడకశిర మండలానికి చెందిన పురుషోత్తం రెడ్డి, ఆర్గనైజేషన్ సెక్రెటరీగా ఎంపికైన అశోక్ ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో నిరుద్యోగులకు ఎంపీఈఓలుగా ఉద్యోగాలు ఇచ్చారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఎంపీఈఓలకు ఒక్క రూపాయి కూడా జీతం పెంచకుండా ఐదేళ్ల ఊడిగం చేయించుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యే రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామికి కృతజ్ఞతలు తెలిపారు.

బొప్పాయిచెట్ల నరికివేత

- దాదాపు రూ.రెండు లక్షల నష్టం

అనంతపురంరూరల్, జూన్ 30: మండలంలోని మన్నీల గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు శనివారం రాత్రి ఓ రైతు సాగు చేసిన బొప్పాయి చెట్లు నరికివేశారు. బత్తపల్లి మండలం ఎర్రాయిపల్లికి చెందిన వెంకటరాముడు మన్నీల గ్రామ పొలం సర్వే నెంబరు 47లోని 4.8 ఎకరాల్లో ఉన్న భూమిలో బొప్పాయి పంట సాగు చేశాడు. ఆరు నెలల కిందట దాదాపు రూ.ఏడు లక్షల పెట్టుపెట్టి ఐదు వేల మొక్కలు నాటాడు. పంటకూడా చేతికొచ్చే దశలో ఉంది. మరో ఇరవై రోజుల్లో పంట కోత కోయాల్సి ఉంది. శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు 500 చెట్ల నరికివేశారు. దీంతో దాదాపు రూ.2లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. ఈ విషయం తెలుసుకున్న ధర్మవరం నియోజకవర్గం తెలుగు రైతు అధ్యక్షుడు చల్లా శ్రీనివాసులు, పలువురు రైతులతో కలిసి పొలాన్ని పరిశీలించారు. రైతుతో కలిసి ఇటుకలపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ రైతుల పట్ల ఇంత రాక్షసంగా వ్యవహరించిన దుండగులపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, రైతులు జయప్ప, నాయుడు, స్టోర్ నాయుడు, చల్లా నాయుడు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ రోహిల్‌పై చర్యలు తీసుకోవాలి

ప్రైవేట్ అంబులెన్స్ యజమానుల యూనియన్ నాయకుల డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

హిందూపురం అర్బన్, జూన్ 30: స్థానిక ప్రభుత్వా సుపత్రిలో తాత్కాలిక సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించి, ఇష్టా రాజ్యంగా వ్యవహరించిన డాక్టర్ రోహిల్‌పై చర్యలు తీసుకోవాలని ప్రైవేట్ అంబులెన్స్ యజమానుల యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. వారు ఆదివారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... డాక్టర్ రోహిల్ ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్‌గా ఉన్నప్పుడు అనేక అక్రమాలకు పాల్పడ్డారని, దీనిపై ఈ యేడాది మార్చి నెల 14వ తేదీన డీఎంహెచ్‌ఓ, డీసీహెచ్, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. మరింత సమాచారం కోసం సమాచారహక్కు చట్టం ద్వారా ఆసుపత్రి వర్గాలను కోరామన్నారు. అయితే దేనికీ ఇంత వరకు స్పష్టత రాలేదన్నారు. ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. డాక్టర్ రోహిల్‌పై ఆసుపత్రిలో చాలా ఫిర్యాదులు ఉన్నాయన్నారు. ఈ విషయాలపై రోహిల్‌ను విచారణ పేరుతో పక్కకు పెట్టారని, అయితే అలాంటి చరిత్ర కలిగిన డాక్టర్‌ను సూపరింటెండెంట్‌గా మరలా నియమిస్తారని సమాచారం అదిందన్నారు. ఆయనపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. అర్హులైన వారిని ఆసుపత్రికి సూపరింటెండెంట్‌గా నియమించి రోగులకు సరైన వైద్య సేవలు అందేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రైవేట్ అంబులెన్స్ యజమానుల యూనియన్ నాయకులు బిలాల్, చాంద్‌బీష, అల్లాబకాష్, షాహిద్, అశ్వక్, ముబారక్ సీఐటీయూ రాము తదితరులు పాల్గొన్నారు.

భరతనాట్యం మన ప్రాచీన సంపద



కళాకారిణుల నృత్య ప్రదర్శన

హిందూపురం అర్బన్, జూన్ 30: భరతనాట్యం దేశ ప్రాచీన సంపద అని, మనదేశం కళలకు పుట్టినిల్లని యోగినారాయణ సేవాసమితి హిందూపురం శాఖ అధ్యక్షుడు రవిశంకర్ పేర్కొన్నాడు. స్థానిక కేవీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం యోగినారాయణ సేవాసమితి ఆధ్వర్యంలో భరతనాట్య ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో ఆదరణ ఉన్న మన ప్రాచీన కళలను వెలికి తీసి మనదేశ సంపదను కాపాడుకుందామని పిలుపునిచ్చాడు. బెంగళూరు, హొసకోటేకు చెందిన సుస్మిత, అమృత కళాబృందాల సహకారంతో నాట్యప్రదర్శన గావించారు. నృత్యకారిణులు చేసిన నృత్యం అందరిని ఆకట్టుకుంది.

మెగా వైద్య శిబిరానికి స్పందన

హిందూపురం అర్బన్, జూన్ 30: పట్టణ పరిధిలోని వాసవీ ధర్మశాలలో ఆదివారం హిందూపురం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. బెంగళూరు ఆర్‌వీ హాస్పిటల్ వైద్య బృందం సహకారంతో 430 మందికి ఉచిత వైద్యసేవలు అందించారు. ప్రముఖ వైద్యుడు డాక్టర్ జేవీ శ్రీనివాస్ బృందం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉచితంగా వివిధ రకాల వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు అందించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు జేపీకే రాము ఆధ్వర్యంలో వైద్య బృందాన్ని సన్మానించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు శ్రీకాంత్, రవీంద్రుడు, ప్రకాష్ తదితరులతో పాటు అనుబంధ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

నూతన క్రిమినల్ చట్టాలను రద్దు చేయాలి

అనంతపురం కల్చరల్, జూన్ 30 : ప్రజాస్వామ్య హక్కులను హరించేలా జూలై 1 నుంచి బీజేపీ ప్రభుత్వం అమలు చేయనున్న మూడు నూతన క్రిమినల్ చట్టాలను రద్దు చేయాలని పౌర చైతన్య వేదిక రాష్ట్ర ఇన్చార్జి, విశ్రాంత డిప్యూటి కలెక్టర్ గోవిందరాజులు డిమాండ్ చేశారు. ఆదివారం పౌర చైతన్యవేదిక ఆధ్వర్యంలో క్లాక్‌టవర్ వద్ద నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా గోవిందరాజులు మాట్లాడు తూ... నూతన చట్టాల గురించి సమాజంలో ఎటువంటి చర్చ లేకుండా, అత్యంత నిరంకుశంగా సోమవారం నుంచి నూతన క్రిమినల్ చట్టాలను అమలు చేస్తామన్న బీజేపీ ప్రభుత్వ నిర్ణయాన్ని పౌర చైతన్య వేదిక వ్యతిరేకిస్తోందన్నారు. ఇప్పటికే ఉన్న సీపీసీ, సీఆర్పీసీ, క్రిమినల్ ఎవిడెన్స్ యాక్ట్ నేర చట్టాల స్థానంలో భారతీయ నాగరిక బీఎన్ఎస్, భారతీయ నాగరిక్ శిక్ష, సన్హిత బీఎన్ఎసస్, బీఎస్ఏ అనే కొత్తపేర్లతో చట్టాలను తీసుకొస్తున్నారన్నారు. ఈ చట్టాలు ప్రజాస్వామ్య హక్కులను హరిస్తాయని, ప్రజల నిరసనలు, చట్ట వ్యతిరేకం కాబోతున్నాయని వాపో యారు. ప్రజా ఉద్యమాలు పెరగకుండా అణచివే యడానికే ఈ చట్టాల ను ఉపయోగిస్తారని విమర్శించారు. కార్యక్రమంలో పౌర చైతన్య వేదిక జిల్లా ఇన్చార్జి రాఘవేంద్ర, నాయకులు, ప్రజా స్వామ్యవాదులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా ఆర్వో ప్లాంట్లు

పాఠశాలల్లో విద్యార్థులకు అందని శుద్ధజలం



సీ కోడిగేపల్లి పాఠశాలలో నిరుపయోగంగా ఉన్న ఆర్వోప్లాంటు

మడకశిర రూరల్, జూన్ 30: విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ కోసం వారికి శుద్ధమైన తాగునీరు అందించేందుకు గతంలో పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటుచేశారు. నిర్వహణ లోపంతో చాలా పాఠశాలల్లో అవి పనిచేయడం లేదు. దీంతో విద్యార్థులకు శుద్ధజలం అందడం లేదు. దీంతో వాటి ఏర్పాటు ఉద్దేశ్యం నెరవేరలేదు. చాలా పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లు చెడిపోయాయి. మరి కొన్నిచోట్ల వాటికి కావలసిన పరికరాలు సమకూర్చడం లేదు. దీంతో దాదాపు దాదాపు మూడేళ్లుగా ఆర్వో ప్లాంట్లు పనిచేయక పాఠశాలల్లో నిరుపయోగంగా ఉన్నాయి. మండలంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు కలిపి మొత్తం 118 ఉన్నాయి. వాటిలో దాదాపు ఎనిమిది వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రస్తుతం అన్ని పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లు పేరుకు మాత్రమే ఉన్నాయి. చాలా పాఠశాలల్లో పనిచేయడం లేదు. ప్రభుత్వ విద్యాభి వృద్ధికి పెద్ద పీటవేశాం అని వైసీపీ గొప్పలు చెప్పుకుందేకానీ, పాఠశాలల్లో చెడిపోయిన ఆర్వో ప్లాంట్లకు మరమ్మతులు చేసి విద్యార్థులకు మంచినీటిని అందించలేకపోయిందని తల్లిదండ్రులు విమర్శిస్తున్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు పిల్లల అభివృద్ధికి, విద్యాభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధచూపుతారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆశాభావం వ్యక్తంచేశారు. ఇప్పటి ప్రభుత్వమైన పట్టించుకుని పాఠశాలల్లో నిరుపయోగంగా ఉన్న ఆర్వో ప్లాంట్లను వినియోగంలోకి తెచ్చి విద్యార్థులకు శుద్ధి జలం అందించాలని కోరుతున్నారు.

పింఛన్ల పంపిణీలో పాల్గొననున్న మంత్రి సవిత

పెనుకొండ టౌన్, జూన్ 30 : రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్లను ఇంటి వద్దకే పంపిణీ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా బీసీ సంక్షేమం, చేనేత, జౌళిశాఖ మంత్రి సవిత నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పాల్గొనున్నారు. మంత్రి ఉదయం 7గంటలకు సోమందేపల్లి మండలం లోని స్నేహలతనగర్‌లో, 8గంటలకు గోరంట్ల మండలం పాలసముద్రం, 9గంటలకు పరిగి మండలం ఊటకూరు, 10గంటలకు పైడేటి పాల్గొననున్నారు. అలాగే 11గంటలకు రొద్దం మండలం మరువపల్లి, 11.30కు పెద్దమంతూరు పంచాయతీ రొప్పాల గ్రామం, మధ్యాహ్నం 12గంటలకు రొద్దం మేజర్ పంచాయతీలో, 1-30నుంచి 3గంటల వరకు పెనుకొండ మండలంలో పింఛన్లు పంపిణీ చేయనున్నారు. మిగిలిన గ్రామ పంచాయతీ ల్లో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఇంటి వద్దకే పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించాలని మంత్రి సవిత పేర్కొన్నారు.

పాల్గొననున్న నందమూరి వసుంధరాదేవి

హిందూపురం, జూన్ 30 : స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సతీమణి నందమూరి వసుంధరాదేవి సోమవారం హిందూపురానికి రానున్నారు. ఎన్టీఆర్ భరోసా పథకం కింద అందజేసే సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొననున్నట్లు టీడీపీ నాయకులు తెలిపారు. ఆమె ఉదయం మొదట చిలమత్తూరు మండలం దేమకేతేపల్లిలో పాల్గొంటారని, అనంతరం లేపాక్షి మండలం చోళసముద్రం, హిందూపురం పట్టణంలోని పలువార్డుల్లో పింఛన్ల పంపిణీలో పాల్గొంటారని తెలిపారు.

విజయవంతం చేయండి : టీడీపీ నాయకులు

గోరంట్ల, జూన్ 30: మండలంలోని అన్ని గ్రామాల్లో సచివాలయ సిబ్బందితో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు సోమవారం జరిగే పింఛన్ల పంపణీ కార్యక్రమంలో పాల్గొనాలని టీడీపీ మండల కన్వీనర్ సోమశేఖర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గోరంట్ల మండలంలోని పాలసముద్రం గ్రామంలో రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత చేతుల మీదుగా ఉదయం 8గంటలకు పింఛన్లు పంపిణీ చేస్తారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను విడతలవారీగా కాకుండా పెంచిన మొత్తాన్ని ఒకేసారి ప్రభుత్వం చెల్లిస్తుండడంతో పండుగ వాతావరణంలో ప్రజలకు అందేలా చూడలన్నారు. కూటమి శ్రేణులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

గుడిబండ: ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ పండగ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, నాయకుడు మద్దనకుంటప్ప పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి గ్రామాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

అగళి: మండలంలోని జంగమరణపల్లిలో 9-30గంటలకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ కుమారస్వామి, జడ్పీటీసీ ఉమేష్ తెలిపారు. మండల వ్యాప్తంగా ఉదయం 6గంటల నుంచే పింఛన్ల పంపిణీ కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. పింఛన్ దారులకు రూ.7వేలు అందజేయనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ ఉపాధ్యక్షుడు రాష్ట్ర గుండుమల తిప్పేస్వామి అగళి, నరసంబుది, మధూడి గ్రామాల్లో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

రొళ్ల: మండలంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల కన్వీనర్ దాసిరెడ్డి, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గురుమూర్తి, ప్రధాన కార్యదర్శి ఈరన్న కోరారు. మండలంలో సోమవారం జరిగే పింఛను పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పాల్గొంటారని మండల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

మడకశిరలో ఓ మోస్తరు వర్షం



వర్షాలు కురుస్తుండటంతో పొలంలో మొలకెత్తుతున్న విత్తనాలు

మడకశిరటౌన్, జూన్ 30: మడకశిరలో ఆదివారం ఈదురు గాలులతో కూడిన ఓ మోస్తరు వర్షం కురిసింది. ఈ ఏడాది వర్షాలు పుష్కలంగా పడుతుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఇటీవల పొలాల్లో వేసిన వేరుశనగ విత్తనాలు మొలకెత్తుతున్నాయి. విత్తనాలు విత్తినప్పటి నుంచి వర్షాలు కురుస్తున్నాయని, ఇలాగే పంట ముగిసేవరకు సకాలంలో వర్షాలు పడితే మంచి దిగుబడి వచ్చే అవకాశాలు ఉన్నాయంటున్నారు.

ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న సభ్యులు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 30: స్థానిక అశోక్‌నగర్‌లోని డీఎస్‌ఏ ఇండోర్‌స్టేడియంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-2024 పోటీలు ఆదివారంతో ముగిశాయి. అండర్-15 బాలుర సింగిల్స్‌లో మురారి వెంకట్, డబుల్స్‌లో జెరోన్ ప్రతిక్-రాజ్‌దీప్, బాలికల్లో నక్షత్ర, డబుల్స్‌లో యగ్నశ్రీ-సహస్ర విజేతలుగా నిలిచారు. అండర్-17 బాలికల్లో సింగిల్స్‌లో యజ్ఞశ్రీ, డబుల్స్‌లో నబియా-ఇందుప్రియ, బాలురలో మురారి వెంకట్, డబుల్స్‌లో జెరోన్‌ప్రతిక్-రాజ్‌దీప్ విజేతలుగా నిలిచారు. అండర్-19 బాలుర సింగిల్స్‌లో విగ్నేష్, డబుల్స్‌లో రాజు-విగ్నేష్, అండర్-11లో బాలికల్లో శ్రీనిధి, డబుల్స్‌లో శ్రీనిధి-మనస్వి, బాలుర సింగిల్స్‌లో కార్తిక్, డబుల్స్‌లో కార్తిక్-నిహాల్, అండర్-13 బాలికల సింగిల్స్‌లో ముస్కాన్, డబుల్స్‌లో రిధి-ముస్కాన్, బాలుర సింగిల్స్‌లో రుషి, డబుల్స్‌లో లిక్షిత్-రుషి, పురుషుల సింగిల్స్‌లో విజయ, డబుల్స్‌లో సునీత్-పాల్‌ప్రణీత్ విజేతలుగా నిలిచారు. విజేతలకు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు బుగ్గయ్యచౌదరి, ప్రధాన కార్యదర్శి జయకుమార్ బహుమతులు అందజేశారు. వీరు ఈనెలలో వివిధ ప్రాంతాల్లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మధు రాయల్, జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉపాధ్య క్షుడు మహ్మద్‌షఫీ, సహాయ కార్యదర్శి అబ్దుల్‌అజీజ్, కోశాధికారి సాంబమూర్తి, సభ్యులు నరేష్, ప్రసాద్ పాల్గొన్నారు.

శిథిలావస్థలో పాఠశాల భవనం

భయాందోళనలో విద్యార్థులు, గ్రామస్థులు



పునాది రాళ్లుతేలిన ఎస్ రాయాపురం పాఠశాల భవనం

గుడిబండ, జూన్ 30: మండలంలోని ఎస్.రాయాపురం పాఠశాల భవనం కూలిపోయే పరిస్థితి ఉంది. పునాది రాళ్లు తేలి ప్రమాద స్థితిలో ఉందని విద్యార్థులు, గ్రామస్థులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల భవనాన్ని గ్రామ సమీపంలోని నేరేడు వంక పక్కన నిర్మించారు. ఇటీవల కురిసిన వర్షాలకు వంక భారీగా ప్రవహిస్తుండటంతో పాఠశాల పునాది రాళ్లు కొట్టుకుపోయే స్థితిలో ఉన్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ప్రహరీ నిర్మించి పాఠశాల భవనం కూలిపోకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.